

పోసిగానిలంకలో మొంథా తుఫానుకు దెబ్బతిన్న అరటి తోట



కన్నీళ్లే మిగిలాయి..!

ఉద్యాన పంటలపై మొంథా తుఫాను ప్రభావం

జిల్లాలో 1,416 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

ఉద్యాన పంటల సాగుకు ఈ ఏడాది వాతావరణం అనుకూలించలేదు. కృష్ణానదికి వరదలు సంభవించిన సమయంలో లంక భూముల్లో సాగు చేసిన వాణిజ్య పంటలు దెబ్బతినగా, మొంథా తుఫాను ప్రభావంతో కంద, పసుపు, అరటి తోటలకు తీరని నష్టం వాటిల్లింది. జిల్లాలో 1,416 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 2,229 మంది రైతులకు రూ.73.45 కోట్ల మేర నష్టం జరిగినట్లుగా ప్రాథమిక నివేదికను ఉద్యానశాఖ అధికారులు తయారుచేశారు. ఈ నష్టం పెరిగే అవకాశం ఉంది.

- కంద, పసుపు, అరటి తోటలకు తీవ్ర నష్టం
- కంద 40 పుట్లకు మించి దిగుబడి రాదంటున్న రైతులు
- గతేడాది కంద పుట్టు ధర రూ.11 వేలు.. ఈ ఏడాది రూ.5,800
- పసుపు దిగుబడి తగ్గుతుందని ఆందోళన
- పూర్తిగా దెబ్బతిన్న అరటి తోటలు

మోపిదేవిలో నేలవాలిన కందతోట



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/మోపిదేవి: కృష్ణానది తీరంలోని లంక గ్రామాల్లో ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. ఈ ఏడాది ప్రారంభం నుంచి వాణిజ్య పంటలు సాగు చేసిన రైతులు ప్రకృతి విపత్తులను ఎదుర్కొంటూనే ఉన్నారు. మొన్నటి వరకు కృష్ణానదికి వరదలు, ఇప్పుడు మొంథా తుఫాను పంటలను తీవ్రంగా దెబ్బతీసింది. ప్రస్తుతం ఉద్యానపంటలు సాగు చేసిన భూముల్లో ఉన్న నీటిని బయటకు తోడే ప్రయత్నాల్లో రైతులు ఉన్నారు. పంట నష్టం అంచనా వేసేవరకు తోటల్లో నీటిని అలానే ఉంచితే మరింతగా నష్టం జరుగుతుందని, అందుకే నీటిని ఇంజన్ల ద్వారా తోడేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

అరటి తోటలకు కోలుకోలేని దెబ్బ

కృష్ణానది తీరం వెంబడి ఉన్న తోట్లవల్లూరు. పెనమలూరు, కంకిపాడు, ఘంటసాల, చల్లపల్లి మోపిదేవి, అవనిగడ్డ తదితర మండలాల్లో అరటి సాగు భారీగా ఉంది. మొంథా తుఫాను కారణంగా గంటకు 92 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో నాలుగు నెలల వయసున్న అరటి చెట్ల నుంచి గెలలు తయారయ్యే దశలో ఉన్న చెట్లు నిలువునా కూలిపోయాయి. అరటి తోట ఎకరానికి రూ.60 వేల వరకు పెట్టుబడిగా పెట్టామని, కౌలుగా రూ.40వేల నుంచి రూ.50వేలుగా ముందస్తుగానే చెల్లించామని, తుఫాను కారణంగా ఈ మొత్తం నష్టపోయామని రైతులు వాపోతున్నారు. అరటి గెలలు తయారయ్యే సమయంలో చెట్లు పడిపోకుండా చెట్లకు వెదురు వాసాలు కూడా పెట్టామని, ఒక్కో వాసం ఖరీదు వంద రూపాయల నుంచి రూ.120 వరకు ఉంటుందని, బలమైన గాలుల కారణంగా అరటి చెట్లు కూలిన సమయంలో వాసాలు కూడా విరిగిపోయాయని ఇదొక రకమైన నష్టమని రైతులు అంటున్నారు.

తగ్గనున్న కంద దిగుబడి

కంద పంటను తుఫానుతో పాటు గతంలో వచ్చిన వరదలు దెబ్బతీశాయి. వాతావరణం సక్రమంగా ఉంటే ఎకరానికి కంద పంట దిగుబడి 70 నుంచి 80 పుట్లు (ఒక పుట్టుకు 250 కిలోలు) వస్తుంది. కంద పంటను మరో నెల రోజుల్లో తవ్వి విక్రయించేందుకు రైతులు సిద్ధమవుతున్న నేపథ్యంలో మొంథా తుఫాను మిగతా 6లో..

చిన్నారులకు మాల వేస్తున్న అర్చకస్వామి, చిత్రంలో ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ



భవానీ మండల దీక్షలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వావసు నామ సంవత్సర భవానీ మండల దీక్షలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ప్రధాన ఆలయం నుంచి ఆలయ మహామండపం 6వ అంతస్తు వరకు మేళ తాళాలు, వేద మంత్రాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఏఈవో బి. వెంకట రెడ్డి, ఆలయ స్థానాచార్యులు వి.శివప్రసాద శర్మ, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి తదితరులు భవానీ దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భవానీలు పాల్గొని అమ్మవారి సన్నిధిలో మాలను ధరించారు. ఫెస్టివల్ సెక్షన్ సూపరింటెండెంట్ సునీత పర్యవేక్షించారు.

పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల తదితరులు



సామాజిక పింఛన్ల పంపిణీలో అగ్రస్థానం

మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీలో మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మచిలీపట్నం మండలం పెదపట్నం గ్రామంలో పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ నెలలో మొదటి తేదీనే పింఛన్లు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంగా దాదాపు 64 లక్షల మందికి రూ. 35 వేల కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచే నాని, తహసీల్దార్ నాగభూషణం, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు తదితరులు

కలెక్టరేట్‌కు సైకిల్‌పై వస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ నవీన్, డీఆర్వో చంద్రశేఖర్



సైకిల్‌పై విధులకు..

శబ్ద, వాయు కాలుష్యం నివారణలో భాగంగా జిల్లా అధికారులు సైకిల్‌పై విధులకు హాజరయ్యారు. కలెక్టర్ బాలాజీ, జాయింట్ కలెక్టర్ నవీన్, డీఆర్‌వో చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో యుగంధర శనివారం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయాలకు సైకిల్ తొక్కుకుంటూ వెళ్లారు. మరికొందరు అధికారులు నడుచుకుంటూ వెళ్లారు. -(ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం టౌన్)

ప్రయాణ వేదికపై నిఘా





బస్సు ఎక్కినా.. దిగినా.. తప్పించుకోలేరు. ఆటో లోపలకు వెళ్లినా, బయటకు వచ్చినా నంబరు ప్లేట్ స్పష్టంగా కనిపిస్తుంది. ప్లాట్‌ఫాంలపై పడే ప్రతి అడుగు క్షుణ్ణంగా రికార్డవుతుంది. ఇక విజయవాడలోని పీఎన్‌బీఎస్ నిఘా నీడలో చేరనుంది. రాజధాని అమరావతిని ఆనుకుని ఉన్న ఈ బస్‌స్టేషన్‌లో ప్రతి ప్రదేశాన్ని నిఘాలో ఉంచేందుకు పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాబోయే రోజుల్లో బస్టాండ్‌లో కూర్చుంటే దాని చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించే విధంగా అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆర్టీసీ అధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఆమోదముద్ర పడగానే పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు.

పీఎన్‌బీఎస్‌లో అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్


- ఆర్టీసీకి ప్రతిపాదనలు పంపిన పోలీస్ శాఖ
- ఇప్పటికే 360 సీసీ కెమెరాలు ఏర్పాటు
- నేరాల నియంత్రణకు పటిష్ట ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): రాష్ట్ర విభజన తర్వాత విజయవాడలోని పీఎన్‌బీఎస్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఇక్కడ మొత్తం 62 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. ఎరైవల్ బ్లాక్‌లో 14 ప్లాట్‌ఫాంలు ఉండగా, డిపార్చర్ బ్లాక్‌లో 48 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. నిత్యం 2700 బస్సులు పీఎన్‌బీఎస్ నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. రెండు లక్షల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2017 ప్రభుత్వం ప్రయాణికుల భద్రత రీత్యా 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. తాజాగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ అధికారులు ప్రజల భద్రత కోసం 'సురక్ష' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం కేటాయించే నిధులతో సంబంధం లేకుండా దాతలను సమీకరించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటి వరకు 10వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఏదైనా ఘటన జరిగినా, నేరం జరిగినా పరిశీలించుకునేందుకు వీలుగా వాటిలో మొమరీ కార్డులను అమర్చారు. ప్రతి కెమెరా నుంచి ప్రత్యక్షంగా అక్కడి పరిసర ప్రాంతాలను వీక్షించడానికి వీలుగా సిమ్ కార్డులను అమర్చాలని భావిస్తున్నారు. నిత్యం లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించడం, దసరా శరన్నవరాత్రులు, భవానీ దీక్షల సమయాల్లో లక్షల్లో భక్తులు వస్తుంటారు. వాటిన్నింటిని పరిగణనలోకి తీసుకుని కృష్ణలంక పోలీసులు పీఎన్‌బీఎస్‌ను కేంద్రంగా చేసుకుని సురక్ష ప్రాజెక్టును అమలు చేశారు. పీఎన్‌బీఎస్‌తోపాటు దానికి చుట్టుపక్కల 360 డిగ్రీల కోణంలో నిఘా పెట్టగల 280 సీసీ మిగతా 6లో..

నూజివీడు.. అటా.. ఇటా!

ఉమ్మడి కృష్ణాజిల్లాలో అతిపెద్ద రెవెన్యూ డివిజన్

- జిల్లాల పునర్విభజనలో ఏలూరులోకి..
- బలంగా వ్యతిరేకిస్తున్న నూజివీడు ప్రజలు
- ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని డిమాండ్
- ఉమ్మడి కృష్ణాలో కలిపేందుకు నాడు చంద్రబాబు హామీ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణా జిల్లాలో అతి పెద్ద రెవెన్యూ డివిజన్‌గా కొనసాగిన నూజివీడును ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వేరు చేయవద్దని ఆ ప్రాంత ప్రజలు బలంగా కోరుకుంటున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు దగ్గర నూజివీడు ప్రాంత ప్రజలు తమ సమస్యను ఏకరువు పెట్టారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఉమ్మడి కృష్ణాజిల్లాలో విలీనం చేసేందుకు అప్పుడు హామీ ఇచ్చారు. ఉమ్మడి కృష్ణా రెండు జిల్లాలుగా మారిన నేపథ్యంలో నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో మిగతా 6లో..

స్మార్ట్ అగ్రికల్చర్!

ఎన్టీఆర్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలుకు ఏర్పాట్లు

- దేశంలోనే తొలి ప్రయోగానికి శ్రీకారం చుట్టిన జిల్లా అధికారులు
- టెక్నాలజీ వినియోగం, ఆర్గానిక్ సాగుల మేళవింపుతో..
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపిన కలెక్టర్ లక్ష్మీశ
- వ్యవసాయ ఖర్చులు తగ్గించి దిగుబడి పెంపే లక్ష్యం



టెక్నాలజీతో వ్యవసాయాన్ని అనుసంధానించి రైతులకు ఖర్చును తగ్గించి, అధిక దిగుబడి.. తద్వారా మరింత ఆదాయం పెంచేందుకు 'స్మార్ట్ అగ్రికల్చర్' విధానానికి ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా ఈ విధానాన్ని అమలు చేయటానికి సిద్ధమైంది. జిల్లాలో ఒక గ్రామాన్ని ముందుగా ఎంపిక చేసుకుని ఈ విధానం అమలు చేయటానికి సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టు గురించి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఇటీవల సీఎం చంద్రబాబు వద్ద ప్రస్తావించారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): స్మార్ట్ అగ్రికల్చర్ ప్రాజెక్టును టెక్నాలజీతో పాటు, ఆర్గానిక్ సాగుల కలబోతగా తీర్చిదిద్దుతున్నారు. వ్యవసాయ రంగంలో మరింతగా శాస్త్ర సాంకేతికతను వినియోగించుకునేలా ప్లాన్ చేశారు. ఇటీవల కాలంలో డ్రోన్ల ద్వారా పురుగు మందుల పిచికారీ చేస్తున్నారు. మొదట్లో ఈ రంగానికి డ్రోన్లు కొత్తగా కనిపించినా.. ఇప్పుడు సర్వసాధారణంగా మారిపోయింది. డ్రోన్ పిచికారీ మిగతా 6లో..

హైలెవల్ కాజ్‌వేలు!

కాజ్‌వేల ఎత్తు పెంపునకు ప్రతిపాదనలు

- మునేరుకు వరదొస్తే.. లింగాల, పెనుగంచిప్రోలు కాజ్‌వేల మునక
- ఏపీ - తెలంగాణ మధ్య రాకపోకలు బంద్
- రెండు కాజ్‌వేలను హై లెవల్‌గా మార్చటానికి ప్రతిపాదనలు
- ఆర్అండ్‌బీ, జలవనరుల శాఖల ద్వారా జాయింట్ సర్వే
- అంచనాలు రూపొందించగానే.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు



లింగాల కాజ్‌వే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మునేరుపై లోలెవల్‌లో ఉన్న కాజ్‌వేలను హైలెవల్ కాజ్‌వేలుగా మార్చేందుకు ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఏటా మునేరుకు భారీ వరదలు వస్తున్నాయి. లో లెవల్‌లో ఉన్న కాజ్‌వేలు ముంపునకు గురవుతున్నాయి. స్థానికంగా వివిధ ప్రాంతాలతో పాటు ఏపీ, తెలంగాణ మధ్య కూడా మిగతా 6లో..

కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి



ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 39వ వ్యవస్థాపక దినోత్సవం వర్సిటీలోని ఆలోచనా హాలులో శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, సైకియాట్రిస్ట్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, వర్సిటీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బంటుమిల్లి మండలం సాతులూరు వద్ద పడిపోయిన వరి చేలను పరిశీలిస్తున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

మొంథా తుఫానును జాతీయ విపత్తుగా ప్రకటించాలి : వైఎస్ షర్మిల

● ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి

కృత్తివెన్ను, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించి, కేంద్ర ప్రభుత్వమే నష్టాన్ని భరించాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 80 లక్షల మంది రైతులకు ఉచిత భీమా అమలు చేయాలని కోరారు. బంటుమిల్లి మండలంలో శనివారం ఆమె పర్యటించారు. సాతులూరు రోడ్డు వద్ద పడిపోయిన వరి చేలను పరిశీలించారు. తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎకరానికి రూ.35లకు పైనే రైతులు నష్టపోయారన్నారు. తుఫాను నష్టాలను తిరిగి అంచనా వేసి, ప్రతి రైతుకు ఎకరానికి రూ.25 వేలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ



కాంతిలాల్ దండే దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

ఇంద్రకీలాద్రి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కనకదుర్గమ్మ అమ్మవారిని శనివారం అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం ఇవ్వగా, అధికారులు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

ఘాట్‌రోడ్డులో కొండరాళ్ల తొలగింపు



ఇంద్రకీలాద్రి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఘాట్ రోడ్డులో జారిపడిన కొండరాళ్లను దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులు తొలగించారు. భారీ వర్షాలకు కొండచరియలు వర్షానికి నాని కొండకు వేసిన ఐరన్ మెష్‌కు కొన్ని రాళ్లు అడ్డుపడ్డాయి. మరికొన్ని రాళ్లు ఐరన్ మెష్‌ను ధ్వంసం చేసి ఘాట్ రోడ్డు సమీపంలో పడ్డాయి. తుఫాన్ కారణంగా ఇంజనీరింగ్ అధికారులు ముందస్తుగానే ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేయటంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. రెండు రోజుల నుంచి ఇంజనీరింగ్ అధికారులు ఐరన్ మెష్‌లో పడిన కొండరాళ్లను తొలగించే పనులు ప్రారంభించారు. గత పది సంవత్సరాల క్రితం కొండకు ఉన్న మెష్ ఏర్పాటు చేశారు. ఈ మెష్ పటిష్టత కోల్పోవటంతో ఇంజనీరింగ్ అధికారులు కొత్త మెష్ ఏర్పాటు చేయటానికి ఇటీవల ఉన్నతాధికారులకు నివేదికను పంపినట్లు సమాచారం.

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



అమరజీవికి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌వో యుగంధర్

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరం అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కలెక్టరేట్ సమావేశపు హాలులో శని వారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరా ములు చిత్రపటానికి మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జహీద్, డీఆర్వో చంద్రశేఖరరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకే నారాయణ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎంహెచ్‌వో పి. యుగంధర్ బార్ అసోసియేషన్ హాలులో అధ్యక్షుడు దివి పోతురాజు నివాళులర్పించారు. న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు పా ల్గొన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి యెండూరి సురేష్, ఎస్. రేణుకారాణి, వేముల శిరీష, అన్నం అశోక్, ఏ.రాంబాబు, ఎస్.ఎన్. గుప్తా తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్ట్రాంగ్‌మెన్ లితేష్ అనిల్, స్ట్రాంగ్ ఉమెన్ వీర నాగ అను



ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న స్ట్రాంగ్‌మెన్ లితేష్ అనిల్ సాయి, స్ట్రాంగ్ ఉమెన్ వీర నాగ అను

గుడివాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యతినివ్వాలని ఎన్టీఆర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.వెంకటరావు అన్నారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లాల ఓపెన్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులందజేశారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలను, క్రీడాకారులను స్టేడియం కమిటీ ప్రోత్సహిస్తోందన్నారు. అనంతరం పవర్ లిఫ్టింగ్ జాతీయ క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. స్ట్రాంగ్ మెన్‌గా సి.హెచ్ లితేష్ అనిల్ సాయి, స్ట్రాంగ్ ఉమెన్‌గా యన్. వీర నాగ అను ఎంపికయ్యారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి రంగప్రసాద్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ సైదా, స్టేడియం కమిటీ సభ్యులు, కోచ్‌లో పాల్గొన్నారు.



కార్తీక పౌర్ణమి స్నానాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, చిత్రంలో కలెక్టర్ బాలాజీ, ఎస్పీ, జేసీ



పెదయాదరలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న మంత్రి రవీంద్ర

కార్తీక పౌర్ణమి స్నానాలకు బీచ్‌లో విస్తృత ఏర్పాట్లు

● తాగునీరు, మరుగుదొడ్లు, సౌకర్యాల కల్పనకు మంత్రి రవీంద్ర ఆదేశం

మచిలీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్రంలో పవిత్ర స్నానమాచరించే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపుహాలులో శనివారం ఆయన కలెక్టర్ .బాలాజీ, ఎస్పీ వి. విద్యాసాగర్‌నాయుడు, జేసీ ఎం నవీన్, అసిస్టెంటు కలెక్టర్ ఫర్హీన్ జహీద్‌లతో కలిసి అధికారులతో కార్తీక పౌర్ణమి పుణ్యస్నానాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ కార్తీక పౌర్ణమి రోజున పవిత్ర స్నానాలు చేసేందుకు మంగినపూడి బీచ్‌కుపెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తారన్నారు. బీచ్ వద్ద భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని సముద్ర స్నానాలు ఆచరించేందుకు లక్ష మందిపైగా వచ్చేఅవకాశం ఉందన్నారు. భక్తులకు మంచినీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య పనులు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా చేయాలన్నారు. పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాళ్లను, పడవలను సిద్ధంగా ఉంచాలన్నారు. బీచ్ వద్ద చెత్తాచెదారాలను తొలగించే ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేయాలన్నారు. బీచ్‌వద్ద ఉచిత వైద్యఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయటంతోపాటు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు. పాండురంగ స్వామి దేవాలయంలో పారిశుధ్య ఏర్పాట్లతోపాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్వో కె. చంద్రశేఖరరావు, ఆర్డీవో స్వాతి, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు రమణారావు, సత్యానందం, సోమశేఖర్, ఆర్ అండ్ బీ ఈఈ లోకేష్, రవాణా అధికారి శ్రీనివాస్, మత్స్యశాఖ జేడీ నాగరాజా, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, డీఎస్పీ రాజా పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు : ఎస్పీ

కార్తీక పౌర్ణమి పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బీచ్ వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. పోలీస్ బందోబస్తుతోపాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామన్నారు. బీచ్ వద్ద సీసీ కెమేరాలతో నిఘా ఉంటుందన్నారు. చిన్నపిల్లలు తప్పిపోకుండా పర్యవేక్షిస్తామని, గతంలో కంటే మెరుగ్గా అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు జాగ్రత్త చర్యలు చేపడతామన్నారు.

రైతులను ఆదుకుంటాం

మచిలీపట్నం టౌన్ : తుపాను వల్ల నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం పెదపట్నం, తాళ్లపాలెం గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను మంత్రి కొల్లు రవీంద్ర శనివారం సందర్శించారు. రైతులను పరామర్శించారు. అధికారులను పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, పంట నష్టంపై సర్వే జరుగుతుందన్నారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచే నాని, టీడీపీ నాయకులు తలారి సోమశేఖర్, మీనవల్లి నాగేశ్వరరావు, ఎండిఓ వెంకటేష్, తహసీల్దార్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక, సాహితీ నిలయం దివిసీమ

● బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



పెదకళ్లేపల్లిలో సుసర్ల దక్షిణామూర్తి, వేటూరి విగ్రహాల వద్ద చాగంటి



మోపిదేవి ఆలయంలో..

మోపిదేవి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక క్షేత్రాలకు నిలయంగా, సంగీత సాహిత్య వేత్తలకు పుట్టినిల్లుగా దివిసీమ ఎంతో ప్రసిద్ధి చెందిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా శనివారం సాయంత్రం 200 మంది శిష్య బృందంతో చాగంటి కోటేశ్వరరావు మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, పెదకళ్లేపల్లి దుర్గా నాగేశ్వరస్వామి, టేకుపల్లి రామేశ్వరస్వామి దేవాలయాలను సందర్శించారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగపుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి నూతన వస్త్రాలతో ఆయనను సత్కరించారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆయనకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. పెదకళ్లేపల్లి దుర్గా నాగేశ్వరాలయంలో ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపారాధన చేసి, ఆకాశ దీపాన్ని స్వయంగా వెలిగించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం సమీపంలో ఉన్న సంగీత, సాహిత్య ప్రముఖులు వేటూరి ప్రభాకర్ శాస్త్రి, సుసర్ల దక్షిణామూర్తి, పింగళి వెంకయ్య, వేటూరి సుందరరామ్మూర్తి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ప్రాంతాన్ని కార్తీక మాసంలో సందర్శించటం శుభపరిణామమన్నారు.



పాండురంగస్వామి ఆలయంలో చాగంటిని సత్కరిస్తున్న గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు, అర్చకుడు టేకి నరసింహం

విద్యార్థులు నైతిక విలువలతో ఎదగాలి

● వైద్యులు దేవుళ్లతో సమానం

మచిలీపట్నం టౌన్ : నైతిక విలువలు పాటిస్తూ క్రమశిక్షణతో ఎదగాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రాష్ట్ర నైతికత, విలువల ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ఉద్బోధించారు. దివిసీమ ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా శనివారం మచిలీపట్నంలోని పాండురంగ స్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు, ఆలయ అర్చకుడు టేకి నరసింహం ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం చాగంటి కోటేశ్వరరావు నిజాంపేటలోని బొబ్బిలి వేణుగోపాల స్వామిని సందర్శించారు. 45వ డివిజన్‌లోని ఐఎంఏ హాలులో శనివారం ఉదయం విద్యార్థులకు సందేశమిచ్చారు. సాయంత్రం వైద్యుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. వైద్యులు నారాయణ స్వరూపులన్నారు. రోగులకు ప్రాణం పోసే వైద్యులు దేవుళ్లతో సమానమన్నారు. వైద్యుల సేవాతత్పరత ప్రశంసనీయమన్నారు. ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య, డాక్టర్ కేశవకృష్ణ, డాక్టర్ కోసూరి ఫణికుమార్, డాక్టర్ బి. శ్రీనివాసాచార్య, డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ రావి శ్రీనివాసరావు, ఆంధ్రా ఆసుపత్రి నుంచి డాక్టర్ పూర్ణచంద్రరావు, డాక్టర్ శివప్రసాద్, బ్రాహ్మణ సంఘం నాయకుడు పి.వి. ఫణికుమార్, కాళీపట్నపు రఘు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ అగ్రికల్చర్!

(5వ పేజీ తరువాయి)

విధానానికి రైతులు కూడా అలవాటు పడిపోయారు. పిచికారీ డ్రోన్లు కలిగిన వారికి ఫోన్లు చేసే పరిస్థితి వరకు వచ్చింది. స్మార్ట్ టెక్నాలజీని అందిపుచ్చుకునే క్రమంలో ఇదొక చిన్న మార్పు మాత్రమే. డ్రోన్ల ద్వారా మరిన్ని సాగు విధానాలను చేపట్టేలా స్మార్ట్ అగ్రికల్చర్ ప్రాజెక్టులో అమలు చేస్తారు. పురుగు మందులనే కాకుండా ఎరువులను కూడా డ్రోన్ల ద్వారా అందించటం చేస్తారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను, వ్యవసాయ శాస్త్రవేత్తలను ఈ ప్రాజెక్టులో భాగం చేస్తున్నారు. పంటలు వేసే దగ్గర నుంచి కోతల దశ వరకు వారి ద్వారా నేరుగా స్మార్ట్ అగ్రికల్చర్ చేపట్టే రైతులకు సలహాలు ఇప్పిస్తారు. ప్రధానంగా భూమిని పరీక్షించి పంటలకు ఆ విస్తీర్ణంలో ఎక్కడ ఎరువులు కావాలి ? భూమిలో ఎంత వరకు నీటిని ఉంచాలి ? పంట విస్తీర్ణంలో ఏ భాగంలో ఎక్కువ నీటి అవసరం ఉంది ? వంటివి కూడా టెక్నాలజీతో ఖచ్చితంగా అంచనా వేసి రైతులకు సూచనలు చేస్తారు. దీనివల్ల ఎరువుల వినియోగాన్ని అవసరమైనంత మేర వినియోగించటంతో పాటు, నీటి వినియోగాన్ని కూడా అవసరమైనంత మేరకే వినియోగించేలా చర్యలు చేపడతారు. ట్రాక్టర్ల ద్వారా పొలం దున్నటం, కలుపుతీత వంటివి కూడా రిమోట్ ఆధారిత డివైజ్‌లతో నీడపట్టున ఉండి పనిచేసే విధానాలను కూడా ప్రాజెక్టులో భాగంగా అమలు చేస్తారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి విధానాలను అమలు చేయటంతో పాటు, అనేక ఇతర పద్ధతులను అమలు చేస్తారు. టెక్నాలజీ విధానాలు మరిన్ని అమలు చేస్తారు. వీటికి సంబంధించి త్వరలోనే వివరాలు బహిర్గత పరచనున్నారు. టెక్నాలజీతో పాటుగా ఆర్గానిక్ వ్యవసాయ విధానాన్ని కూడా ప్రోత్సహిస్తారు. ఆర్గానిక్ సాగు పద్ధతులను ముందుకు తీసుకువెళ్లటానికి ప్రత్యేక బృందాలను నియమిస్తారు.

తక్కువ ఖర్చు.. అధిక దిగుబడులు

స్మార్ట్ అగ్రికల్చర్ విధానాన్ని అమలు చేయటం ద్వారా వ్యవసాయానికి అయ్యే ఖర్చును గణనీయంగా తగ్గించటానికి అవకాశం ఉంటుంది. దీని వల్ల రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ఇదే సందర్భంగా టెక్నాలజీ, ఆర్గానిక్ ఫామింగ్ వంటి వాటి వల్ల పంటలకు అవసరమైనంత మేరకు పోషకాలను అందించి మంచి దిగుబడి సాధించేలా చేయటం జరుగుతుంది. పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గటంతో పాటు, దిగుబడులు పెరగటం వల్ల వ్యవసాయం లాభసాటిగా మారుతుంది.

స్మార్ట్ అగ్రికల్చర్ ప్రాజెక్టు సిద్ధం చేశాం : లక్ష్మీశ, కలెక్టర్,

స్మార్ట్ అగ్రికల్చర్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశాం. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక పంపించాం. అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాం. అనుమతులు రాగానే జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తాం. ఈ ప్రాజెక్టు వల్ల రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుంది. వ్యవసాయ ఖర్చును తగ్గించటంతో పాటు దిగుబడులను కూడా గణనీయంగా పెంచవచ్చు. అతి త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర వివరాలను అందరికీ తెలియజేస్తాం.

హైలెవల్ కాజ్‌వేలు!

(5వ పేజీ తరువాయి)

రాకపోకలు స్తంభిస్తున్నాయి. లో లెవల్ కాజ్‌వేల కారణంగా మునేరుకు వరద వచ్చిన ప్రతిసారీ వీటి మీదుగా వరద ప్రవహిస్తోంది. వాహనదారులు కాజ్‌వేల మీదుగా మునేరులో కొట్టుకుపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. వాహనాలు కూడా పడిన ఉదంతాలు ఉన్నాయి. చిల్లకల్లు వైరా రూట్ (స్టేట్ హైవే)లో లింగాల దగ్గర లో లెవల్ కాజ్‌వే చాలా పాతది. దీనిని 1954లో నిర్మించారు. పెనుగంచిప్రోలు - మధిర రోడ్డు మార్గంలో పెనుగంచిప్రోలు దగ్గర లో లెవల్ మినీ కాజ్‌వేను 1994లో నిర్మించారు. మూడవది కీసర దగ్గర హైలెవల్ బ్రిడ్జి రాక, పోకలకు వేర్వేరు వరుసలలో నిర్మించారు. మునేరుపై ఈ బ్రిడ్జి ఒక్కటి మాత్రమే వరద వచ్చినా ఇబ్బంది లేకుండా ఉంటోంది. లింగాల కాజ్‌వే, పెనుగంచిప్రోలో మినీ కాజ్‌వేలను మాత్రం భవిష్యత్తు ఆలోచనలు లేకుండా నిర్మించారు. వరదలు వస్తాయని తెలిసినా.. హై లెవల్‌లో నిర్మించే ప్రయత్నం చేయలేదు. వరదలకు కాజ్‌వే మునిగిపోతుందని తెలిసినపుడు పెనుగంచిప్రోలు దగ్గర తలపెట్టిన మినీ కాజ్‌వేను హై లెవల్‌లో నిర్మించకుండా లింగాల కంటే మరింత లో లెవల్‌లో నిర్మించారు. లక్షన్నర క్యూసెక్కుల వరద వస్తే చాలు.. రెండు కాజ్‌వేలు మునిగిపోతాయి. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం వీటిని హైలెవల్ కాజ్‌వేలుగా, వంతెనలుగా కానీ అభివృద్ధి చేయటానికి వీలుగా నిర్ణయం తీసుకున్నారు. ఆర్అండ్‌బీ, జలవనరులశాఖల ద్వారా సర్వే చేయిచి సరికొత్త అంచనాలను తయారు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. హై లెవల్ కాజ్‌వేల ప్రతిపాదనలు రాగానే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లి పరిస్థితి తీవ్రతను వివరించి అనుమతులు సాధించేలా యంత్రాంగం చర్యలు చేపట్టబోతోంది.

కన్నీళ్లే మిగిలాయి..!

(5వ పేజీ తరువాయి)

ప్రభావంతో వీచిన బలమైన గాలుల కారణంగా కంద మొక్కలు విరిగి పడిపోయాయి. విరిగిన మొక్కల కారణంగా దుంపకు ఆహారం సక్రమంగా అందదని, దుంప పూర్తిస్థాయిలో తయారు కాదని, దీంతో ఎకరానికి 40 పుట్ల మేర మాత్రమే దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. గతేడాది ఇదే రోజుల్లో 250 కిలోల కంద ధర రూ.11వేలు ఉండగా, ఈ ఏడాది ప్రస్తుతం రూ.5,800లుగా ధర ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను కారణంగా దిగుబడి తగ్గడం ఒక ఎత్తయితే, దిబుడి తగ్గడంతోపాటు ధర తగ్గిన కారణంగా కంద పంట సాగు చేసిన రైతులకు ఈ ఏడాది నష్టాలే మిగలుతాయని రైతులు వాపోతున్నారు. ఎకరం కంద పంట సాగుకు కౌలుతో కలిపి రూ.1.50లక్షల వరకు ఖర్చులు అవుతాయని, అంతా బాగుంటే రూ.3.50 లక్షల వరకు వస్తుందని, ఈ ఏడాది ఎంత మేర రైతులకు ఆదాయం వస్తుందో చెప్పలేకున్నామని అంటున్నారు.

పసుపు దిగుబడి.. సన్నగిల్లుతున్న ఆశలు

జిల్లాలో పసుపు 2,200 హెక్టార్ల వరకు సాగులో ఉంది. ఎకరం పసుపు సాగుకు రూ.1.75 లక్షల వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కృష్ణానదికి వచ్చిన భారీ వరదల కారణంగా పసుపు తోటలు దెబ్బతిన్నాయి, పంటను బతికించుకునేందుకు ఎరువులను ఒకటికి, రెండు సార్లు వేసి పసుపు నిలదొక్కుకునేలా రైతులు యాజమాన్య పద్ధతులు పాటించారు. మొంథా తుఫాను కారణంగా వీచిన బలమైన గాలులకు పసుపు మొక్కలు సైతం విరిగిపోయి నేలావాలాయి. మొక్కలు విరిగిపోవడంతో భూమిలో ఉన్న పసుపు దుంపలు పూర్తిగా తయారు కావని, దీంతో దిగుబడి తగ్గుతుందని రైతులు అంటున్నారు. ఎకరానికి సరాసరిన 35 నుంచి 40 క్వింటాళ్ల పసుపు దిగుబడి వస్తుందని, తుఫాను ప్రభావంతో వీచిన గాలుల కారణంగా ఎకరానికి 10క్వింటాళ్ల దిగుబడి తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు.

కంద, పసుపు సాగుచేశా



మూడున్నర ఎకరాల్లో కంద, పసుపు సాగుచేశా. అధిక వర్షాలు, తుఫాను కారణంగా పసుపు పంట దెబ్బతింది. పసుపు మొక్కలు విరిగిపోవడంతో దిగుబడి, నాణ్యత కూడా తగ్గిపోతుంది, కందపంట మరికొద్ది రోజుల్లో చేతికందే దశలో ఉంది. కంద చెట్లు విరిగిపడిపోవడంతో దుంప పూర్తిగా తయారు కాదు. దీంతో ఎంత ధర పలుకుతుందో తెలియనిస్థితి నెలకొంది. ఉద్యాన పంటలకు పంట బీమా అందించి రైతులను ఆదుకోవాలి.

-గరికపాటి వెంకటేశ్వరరావు, నాగాయతిప్ప, మోపిదేవి మండలం

అరటి పడిపోయింది



ఎకరంన్నర భూమిలో కూర అరటి సాగు చేశా. తుఫాను ప్రభావంతో బలమైన గాలులు వీయడంతో అరటి తోట మొత్తం పడిపోయింది. ఎకరాకు 1500 మొక్కలు నాటా. వారం రోజుల్లో అరటి గెలల విక్రయం జరిపేందుకు సిద్ధమవుతున్నా. ఒక గెల కనీసంగా రెండు వందలు పలికేది. ఇప్పటి వరకు రూ.1.75 లక్షల మేర పెట్టుబడిగా పెట్టాను. అరటి చెట్లు పడిపోవడంతో పూర్తిగా నష్టపోయాను. పంట నష్టం సక్రమంగా నమోదు చేయడంతో పాటు, పంట బీమా ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

-పుప్పాల ఏసు, పోసిగానిలంక, మోపిదేవి మండలం



మాటాడుతున్న నటుడు, దర్శకుడు త్రినాథ్, పక్కన సాహితీ అవాంచ

సినిమా షూటింగ్‌లకు మచిలీపట్నం ఎంతో అనుకూలం

● దర్శకుడు, నటుడు త్రినాథ్

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్, బందరు కోట, పోర్టు, పాండురంగస్వామి దేవాలయం సినిమా షూటింగ్‌కు ఎంతో అనుకూలమని దర్శకుడు, వర్ధమాన నటుడు త్రినాథ్ కటారి అన్నారు. మచిలీపట్నంలోని వేమూరి కల్యాణ మండపంలో శనివారం రాత్రి 9గంటలకు ఇట్లు మీ ఎదవ చిత్రం యూనిట్ విలేకరులతో మాట్లాడింది. చిత్ర దర్శకుడు, కథానాయకుడు త్రినాథ్ కటారి మాట్లాడుతూ, మచిలీపట్నంలో షూటింగ్ పూర్తి చేసుకుని ఈనెల 21వ తేదీన విడుదల కానుందన్నారు. మచిలీపట్నం పోర్టు, గిలకలదిండి హార్బర్ తదితర ప్రాంతాలలో షూటింగ్ చేశామన్నారు. కుటుంబంలోని అనుబంధాలు, కామెడీతో ప్రేక్షకులను తమ సినిమా అలరిస్తుందన్నారు. పక్కింటి తెలుగు అమ్మాయిగా సాహితీ అవాంచ చక్కటి నటనను కనబరిచిందన్నారు. ప్రేక్షకులందరూ సినిమాను ఆదరించాలని దర్శకుడు కటారి కోరారు. హీరోయిన్ సాహితీ అవాం చ, నిర్మాత బళ్లారి శంకర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మల్లి, లైన్ ప్రొడ్యూసర్ బృందావన్ కేతిరెడ్డి, డీవోపీ జగదీష్ చీకటి, ఎడిటర్ ఉద్దవ్, థియేటర్ అధినేత వేమూరి బాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణ వేదికపై నిఘా

(5వ పేజీ తరువాయి)

కెమెరాలను ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం పీఎన్‌బీఎస్ 360 సీసీ కెమెరాల నిఘాలో ఉంది. బస్‌స్టేషన్‌లో ఏ ప్లాట్ ఫాం వద్ద ఏం జరుగుతోంది, ప్రయాణికుల రద్దీ ఎలా ఉంది, ఎవరెవరు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారో ప్రత్యక్షంగా వీక్షించడానికి వీలుగా ఒక అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని పోలీసులు భావిస్తున్నారు. ఇక్కడ పోలీస్ సిబ్బందితోపాటు ఆర్టీసీ సిబ్బంది ఉంటారు. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పెద్ద వీడియోవాల్‌ను ఏర్పాటు చేస్తారు. పీఎన్‌బీఎస్ సంక్రాంతి, దసరా, దీపావళి, వేసవి సెలవుల్లో రద్దీగా ఉంటుంది. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ తమతో పాటు ఆర్టీసీ అధికారులకు ఉపయోగ కరంగా ఉంటుందని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

నూజివీడు.. అటా.. ఇటా!

(5వ పేజీ తరువాయి)

కలుపుతారా ? కృష్ణాజిల్లాలో కలుపుతారా ? అన్నది ఆసక్తికరంగా మారింది. భౌగోళికంగా చూస్తే నూజివీడు ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లాను ఆనుకుని ఉంది. ఏలూరు జిల్లాను వద్దనుకుంటున్న నూజివీడు ప్రజలకు కృష్ణాజిల్లా ఇంకా దూరంగా ఉంటుంది. నూజివీడు ప్రాంత ప్రజలు కూడా ఎన్టీఆర్ జిల్లాలోనే విలీనం చేయాలని కోరుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నపుడు నూజివీడు అతి పెద్ద రెవెన్యూ డివిజన్‌గా ఉండేది. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో నూజివీడు, చాట్రాయి, ముసునూరు, ఆగిరిపల్లి, గంపలగూడెం, తిరువూరు, ఏ కొండూరు, విస్సన్నపేట, మైలవరం, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు ఉయ్యూరు, పమిడిముక్కల మండలాలు ఉండేవి. ప్రస్తుత ఉయ్యూరు డివిజన్ కూడా అప్పట్లో నూజివీడు డివిజన్ పరిధిలో ఉండేది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో నూజివీడును ఏలూరు జిల్లాలో విలీనం చేయటం జరిగింది. దీంతో ఈ ప్రాంత ప్రజలు భౌగోళికంగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. గన్నవరం, పెనమలూరును ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేసే క్రమంలో కృష్ణాజిల్లాలో నూజివీడును విలీనం చేసే అవకాశం దాదాపుగా ఉండదనే చెప్పాల్సి వస్తోంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

ఉన్నత విద్యావకాశాలపై అవగాహన ర్యాలీ



కానూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం తాడిగడప జడ్పీ హైస్కూల్‌లో ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన ర్యాలీ జరి గింది. ఈ సందర్భంగా ఐటీ విభా గాధిపతి డాక్టర్ సునీత మాట్లాడుతూ, పదవ తరగతి అనంతరం లభించే విద్యావకాశాలు, వివిధ కోర్సులు, స్కాలర్‌షిప్‌లు, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్ తదితర కోర్సులను గురించి వివరించారు. వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ శివరాం ప్రసాద్, అధికారి మాధవితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు శనివారం పట్టుకున్నారు. ఓగిరాల పరిసర ప్రాంతాల్లో రేషన్ కార్డుదారుల వద్ద నుంచి కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్న 500 రేషన్ బియ్యాన్ని స్థానికుల సమాచారం మేరకు పీడీఎస్ డీటీ బి. అంకాలు స్వాధీనం చేసుకున్నారు. ఆటోను హనుమాన్ జంక్షన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో పాలకులు విఫలం అవుతున్నారని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకుడు గణేష్ డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం నుంచి హామీ కోసం పోరాటం, దానికి జీవో తీసుకురావటం కోసం మరో పోరాటం, అమలుకు జీవితకాల పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బెజవాడ తాతబ్బాయి, కైలే ఏసుదాసు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు



గన్నవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం స్థానిక కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో అం డర్-17 బాల బాలికల షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు ఉత్సాహం గా శనివారం జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి పోటీ పడ్డారు. క్రీడా సమాఖ్య కార్యద ర్శులు ఎం.అరుణ, జి.రాంబాబు, వ్యాయామోపాధ్యాయుల అసోసియేషన్ రాష్ట్ర వైస్ ఛైర్మన్ కేవీఆర్ కిషోర్, అశోక్, ముకుంద, ధనియాల నాగరాజు, సీహెచ్ చంద్రశేఖర్, కొమ్మినేని గీత, శాంతి కిరణ్, టాన్యగిరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నున్న వికాస్‌లో రక్తదాన శిబిరం



విజయవాడ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం నున్నలోని వికాస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం జరిగింది. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో కళాశాల ఛైర్మన్ ఎన్ నర్సిరెడ్డి రక్తదానంపై విద్యార్థు లకు అవగాహన కల్పించారు. అనంతరం 120 మంది విద్యార్థులు, పదిమంది ఉపాధ్యాయులు కర్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు, డైరెక్టర్ కీర్తన, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ వీవీపీఎస్ అంజనేయులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వీ దుర్గాప్రసాద్ తదీతరులు పాల్గొన్నారు.

త్యాగజీవి పొట్టి శ్రీరాములు



ఉయ్యూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణదీక్ష చేసి ప్రాణాలర్పించిన త్యాగజీవి పొట్టి శ్రీరాములు అని పలువురు కీర్తించారు. నవంబరు 1 ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని ఏజీ అండ్ ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పొట్టి శ్రీరాములు చిత్రపటంవద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సాంబశివరావు, అధ్యక్ష కార్యదర్శులు సత్తార్, పూర్ణ గుర్తుచేశారు.

ఉరివేసుకుని బాలిక ఆత్మహత్య

పెనమలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో తల్లిదండ్రుల మధ్య తరచూ జరుగుతున్న గొడవలతో మనస్తాపం చెందిన బాలిక ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యనమలకుదురు లంబాడీపేటకు చెందిన గుంజి మల్లీశ్వరికి ముగ్గురు సంతానం. వారిలో రెండవ కుమార్తె పుష్పలత (14) ఇంట్లో తల్లిదండ్రుల మధ్య జరుగుతున్న గొడవలకు మనస్తాపం చెంది శుక్రవారం సాయంత్రం తమ ఇంట్లోని రేకుల షెడ్డులో ఉన్న పైపుకు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

కార్పొరేట్ సంసిద్ధతపై ముగిసిన శిక్షణ

కానూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో వర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ), స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో కార్పొరేట్ సంసిద్ధతపై గత రెండు రోజులగా జరుగుతున్న శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మైలాన్ లాబొరేటరీస్ లిమిటెడ్ (హైదరాబాద్) రీసోర్సెస్ హెడ్ డాక్టర్ నాగినేని మల్లికార్జున్ ప్రసంగిస్తూ కార్పొరేట్ రంగంలో విజయవంతమైన కెరియర్‌ను నిర్మించుకోవాలంటే నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందాలని సూచించారు. శిక్షణ శిబిరంలో విభాగాధిపతి ప్రొఫెసర్ ఎ. శ్రీరామ్, ప్లేస్‌మెంట్ హెడ్ కె. శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్. శైలజతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



ఉయ్యూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చదువుకు నేందుకు పేదరికం అడ్డు కారాదని కృషి, పట్టుదల, కఠోరదీక్షతో కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకుని పేరు ప్రఖ్యాతులు గడించాలని సుధీర్ టింబర్ డిపో అధినేత, వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నూకల వెంకట సాంబశివరావు అన్నారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల విద్యార్థులు ముగ్గురికి ప్రోత్సాహక నగదు బహుమతిగా రూ.15వేలు శనివారం అందజేశారు. కళాశాల డైరెక్టర్ వినయ్ కుమార్, కుటుంబరాజు, వంశీ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు తెన్నేరు విద్యార్థులు

కంకిపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు అర్హత సాధించటం ఆనందంగా ఉందని తెన్నేరు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావుఅన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, పటమట జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి సెలక్షన్స్‌లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కాబడ్డారన్నారు. బాలికల అండర్ 17 విభాగంలో కూరపాటి నిహారిక, బాలు విభాగంలో మాతంగి మున్నీ, అండర్ 14 బాలికల విభాగంలో ఉప్పు తేజస్విని ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపిక అయిన విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీ మిరియాల సాయి కుమార్, ఎస్‌ఎంసీ ఛైర్మన్ లంకా నాగబాబు, స్టాఫ్ కార్యదర్శి రవికిషోర్‌లు అభినందించారు.





పెనమలూరులో పింఛన్లను పంపిణీ చేస్తున్న మారుపూడి, కోయ ఆనంద్‌ప్రసాద్.. కానూరులో కమిషనర్ నజీర్.. జక్కులనెక్కలంలో గూడపాటి తులసీమోహన్..



విజయవాడలో చికిత్స పొందుతున్న వేలేరుకు చెందిన వ్యక్తికి పింఛను అందజేత

పింఛన్ల పెంపు ఘనత చంద్రబాబుదే

ఎమ్మెల్యే బోడె ప్రసాద్




వీరవల్లిలో మహిళకు వృద్ధాప్య పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. పోరంకిలో అనుమోలు

ఉయ్యూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్లు పెంచిన ఘనత చంద్రబాబుదేనని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కడవకొల్లు పంచాయతీ వీరవల్లి కాకాని నగర్‌లో శనివారం వృద్ధులు, వికాలాంగులకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మొంథా తుపానుకు దెబ్బతిన్న గృహానికి రూ. 5వేల చొప్పున రూ. 30 వేలు వ్యక్తిగతంగా అందజేశారు.

పెనమలూరు: పేదల సంక్షేమమే అజెండాగా టీడీపీ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, శొంఠి శివరాంప్రసాద్‌లు పేర్కొన్నారు. శనివారం పోరంకి, పెనమలూరు పల్లిపేట సుగాలి కాలనీ, యనమలకుదురు తదితర ప్రాంతాల్లో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోటకూర ఉదయభాస్కర్, చిగురుపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కానూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు, యనమలకుదురు సర్కిల్స్‌లో శనివారం మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ సామాజిక పింఛన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ మండల అధ్యక్షులు గూడపాటి తులసీమోహన్ అన్నారు. మండలంలోని జక్కులనెక్కలంలో శనివారం పెన్షన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తులసీమోహన్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమాన్ని సమాంతరంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీసుకు వెళుతున్నారని తెలిపారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు బాల సుబ్రమణ్యం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: అవసరానికి అండగా మొదటి తేదీనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఆందజేయడం సామాజిక భరోసా అని బొమ్ములూరు సర్పంచ్ కాటూరు విజయభాస్కర్, టీఎన్‌టీయుసీ నాయకుడు పాండు రంగారావు, ఎస్‌ఎస్‌ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ వేర్వేరు కార్యక్రమాల్లో అన్నారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో శనివారం ఉదయం నుంచే సామాజిక పెన్షన్ల పంపిణీ నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటికి వెళ్లి పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు.

● వేలేరుకు చెందిన నూతక్కి శివశంకర్‌రావు అనారోగ్యంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. శనివారం స్థానిక నాయకుడు వేములపల్లి శ్రీనివాసరావు వాహనం ఏర్పాటు చేయడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ వడ్లమూడి మాణిక్యం విజయవాడ వెళ్లి పెన్షన్ అందజేశారు.

హనుమాన్‌జంక్షన్: బాపులపాడులో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరక్టర్ గార్లపాటి రాజేశ్వరరావు, నాయకులు తాడిశెట్టి శ్రీను, చీలి ఆనంద్, పొట్లూరి ఫణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని తెన్నేరులో డీసీ యార్లగడ్డ రాజా, ఇతర కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. ఈడుపుగల్లులో సర్పంచ్ పందిపాటి ఇందిర, ఉప్పలూరులో పార్టీ గ్రామాధ్యక్షుడు చలసాని రాధాకృష్ణమూర్తి, కంకిపాడులో క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరపురంలో..



బాపులపాడులో..



కంకిపాడు మండలం తెన్నేరులో..



బొమ్ములూరులో సర్పంచ్ కాటూరి విజయభాస్కర్

ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుంది: ఆళ్ల



రంగన్నగూడెంలో మినప చేను పరిశీలిస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ఆదుకుం టుందని ఎన్‌ఎస్‌ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. రంగన్నగూడెం, సింగన్నగూడెం గ్రామాల్లో తుఫాన్ వల్ల నష్టపోయిన మినుము పంటను టీడీపీ నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ కనకవల్లి శేషగిరిరావు, పల్లగాని వీరాంజనేయులు, బెజవాడ కృష్ణారావు, ఈతాకుల ప్రసాద్, కాగిత మల్లేశ్వరరావు, బత్తిన గంగాధరరావు, మరీదు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ఎమ్మెల్యే బోడె అజెండా : తుమ్మలపల్లి



కంకిపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధే ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రధాన అజెండా అని సీనియర్ టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. కంకిపాడు మండ ల పరిషత్ ప్రధాన రహదారి పనులను స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మీ ఆదేశాలకు అనుగుణంగా రూ. 23 లక్షలతో మండల పరిషత్ ప్రధాన రహదారి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అదే విధంగా నియోజకవర్గంలోని కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు మండలాల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో కన్వీ నర్ పులి శ్రీనివాసరావు, స్థానిక టీడీపీ నాయకులు కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, వీరంకి శ్యాం, కాకుమాను రమేష్, జనసేన పార్టీ నాయకులు పిచుక క్రాంతి పాల్గొన్నారు.

ప్రపంచ ఆక్యుపంక్చర్ డే వేడుకలు ప్రారంభం

కానూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కానూరు అశోక్‌నగర్‌లోని ఇండియన్ ఓం కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రపంచ ఆక్యుపంక్చర్ డే వేడుకలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ వేడుకలను ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ ఆఫ్ భారత్‌ఫౌండర్ అండ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మాకాల సత్యనారాయణ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆక్యుపంక్చర్ డే పురస్కరించుకొని ఈనెల 16వ తేదీ వరకు అక్యుపంక్చర్ అవగాహన, చికిత్స, శిక్షణ, అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి



కంకిపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవా లని సర్పంచ్ బాకి రమణ అన్నారు. వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కంకిపాడులో నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమణ మాట్లాడుతూ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యా ర్థులు వారం రోజుల పాటు గ్రామంలో ఉంటూ వివిధ సేవా కార్యక్రమంలో పాల్గొనడం హర్షణీయ మన్నారు. కంకిపాడు గ్రామ పంచాయతీ తరుపున విద్యార్థులకు పూర్తి సహకా రాన్ని అందిస్తామని ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు సీహెచ్‌సీ ఛైర్మన్ బోయిన రోహిణి కుమారి, పీఏసీఎస్ ఛైర్మన్ సుంకర శివ, పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర వరప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. పాండురంగ, ఎర్రపోతు రామకృష్ణ, బోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక ఏకాదశి సందడి



గండిగుంట అయ్యప్పస్వామి ఆలయంలోవ్రతాలు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక ఏకాదశి పర్వదినం పురస్కరించుకొనిశ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం భక్తులు సందడి నెలకొంది. ఈవో వైశ్రీని వాస్ పర్యవేక్షణలో అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యుల స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బాపులపాడు శ్రీభ్రమరాంబిక సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకొని మరకత లింగేశ్వరస్వామికి అర్చకులు సామవేదం మారుతి శర్మ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిపారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పవిత్రమైన కార్తీక మాస శుద్ధ ఏకాదశి సందర్భంగా శనివారం శివాలయాల్లో అభిషేకం, హోమాలు నిర్వహించారు. మడిచర్లలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో పంచామృతా భిషేకం, పార్థివ లింగేశ్వర స్వామి వారికి ఉత్సవ మూర్తులకు అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. కానుమోలులోని సగరపేటలోని శ్రీమల్లికార్జునస్వామి (చరలింగం) ఆలయంలో పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. అర్చకులు నాగరాజశర్మ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ నారాయణ సహిత రుద్ర హోమం నిర్వహించారు.

ఉయ్యూరు : కార్తీక శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని గండిగుంట షిర్డీసాయిబాబా, అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజారి కామేశ్వరశర్మ పూజలు చేయించారు.

దుర్గగుడిలో అన్నదాన పథకానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న అన్నదాన పథకానికి పలువురు దాతలు శని వారం ఆలయ అధికారులకు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. విజయ వాడ పోరంకికి చెందిన బండి మౌనిక కుటుంబ సభ్యులు అన్నదాన పథకానికి రూ.1,03,000లు అధికారులకు అందజేశారు.


బెజవాడ బాషా


ఇస్మార్ట్ స్వీటీ


భాస్కర్

జాతీయ నేతల జయంతులు కావచ్చు, సాంస్కృతిక ఉత్సవాలు కావొచ్చు.. సినిమా ఈవెంట్లు.. ప్రభుత్వ కార్యక్రమాలు.. వేదిక ఏదైనా యాంకర్ల స్వరం జోష్‌తో ఫీంకరిస్తుంది! వారి సందేశాత్మకంతో కూడిన చమత్కారమైన వ్యాఖ్యానం ప్రేక్షకుల హృదయాలను ఆకర్షిస్తూ, అతిథులను సమ్మోహిస్తూ, సభలకు సజీవత్వాన్ని అందిస్తోంది. రేడియో నుంచి సాంస్కృతిక సమ్మేళనాల వరకు, వీరి వినోదాత్మక సందేశాలు సమాజంలో స్ఫూర్తిని రగిలిస్తాయి. స్థానిక ప్రతిభను ఉత్తేజపరుస్తూ, సామాజిక అవగాహనను చైతన్యవంతం చేస్తూ, యువతను ప్రేరేపిస్తారు. సభలు, టీవీ, సోషల్ మీడియా వేదికలపై వీరి స్వర మాయాజాలం ఉల్లాసరాగాన్ని పలికిస్తూ, ప్రతి కార్యక్రమాన్ని పరిపూర్ణం చేస్తుంది. అలాంటి యాంకర్ల జోష్‌ను పరిచయం చేస్తూ ఈ ఆదివారం ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

హలో అండీ.. ! అందరూ బాగున్నారా..!

యాంకరింగ్‌లో దుమ్ము రేపుతున్న బెజవాడోళ్లు !!



- ఆల్ ఇన్ వన్ యాంకర్స్‌గా ఎదుగుతున్న నవతరం యాంకర్లు
- ఉన్నత చదువులు.. యాంకరింగ్‌పై మక్కువతో ఫీల్డ్‌లోకి
- సమ్మోహనభరిత కంఠంతో.. వేదికలపై జోష్

సండే స్పెషల్

అతను ఒక్కసారి చెబితే వంద సార్లు చెప్పినట్లే.. యాంకర్ బెజవాడ బాషా

బాషా ఒకసారి చెప్తే వంద సార్లు చెప్పినట్టే.. ఈ సినిమా డైలాగ్ ఇక్కడ ఆర్జేగా ప్రస్థానం మొదలైన బాషా రేడియో జాకిగా అంతే పేరు తెచ్చుకున్నారు. రేడియో రంగంలో స్ఫూర్తిదాయక ప్రయాణం చేస్తూ బెజవాడ బాషాగా ఖ్యాతి గడించిన అదిల్ బాషా షైక్, రెడ్ ఎఫ్ఎం విజయవాడ స్టేషన్ ప్రోగ్రామింగ్ హెడ్‌గా ఉన్నత స్థాయికి చేరుకున్నారు. మచిలీపట్నంలో జన్మించిన బాషా, నాగార్జున వర్సిటీ నుంచి ఎంఏ జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ పూర్తి చేశాడు. 2006లో రేడియో మిర్చి ఆడిషన్‌లో పోటీదారులను అధిగమించి సెలక్ట్ అయ్యారు, అక్కడి నుంచి "బెజవాడ బాషా" అనే పేరు తెలుగు రేడియో ప్రపంచంలో సుపరిచితమైంది. కాలేజీ రోజుల్లో 'ఆంధ్రజ్యోతి', 'సంక్రాంతి సంబరాలు' వంటి కార్యక్రమాలతో యాంకరింగ్‌లో మొదటి అడుగులు వేశారు. రూట్స్ హెల్త్ ఫౌండేషన్‌తో కలిసి చేసిన అవగాహన కార్యక్రమాలు విశేష ప్రశంసలు అందుకున్నాయి.

ఈవెంట్ మేనేజ్‌మెంట్.. యాంకరింగ్‌లో.. భాస్కర్ ప్రతిభ

కృష్ణాజిల్లా పామర్రు మండలం కురుమద్దాలి గ్రామానికి చెందిన కర్రి వెంకట భాస్కర రావు, తెలుగు రాష్ట్రాల్లో యాంకర్ భాస్కర్‌గా తనదైన గుర్తింపు సంపాదించారు. ధనికుల ఇంజనీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశారు. యాంకరింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వహణపై ఆసక్తితో నగరంలోని బందర్ రోడ్‌పై 2017లో ప్రారంభించిన 'హ్యాపీ సండే'తో ఈవెంట్స్ తన వృత్తిగా మొదలెట్టారు. 9ఏళ్ల అనుభవంతో, సీఎం సభలు, జిల్లా స్థాయి ఈవెంట్‌లు, వీఎంసీ కార్యక్రమాల్లో వ్యాఖ్యాతగా పనిచేశారు. 2024లో సీఎం ప్రమాణ స్వీకారంలో భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలకు వ్యాఖ్యాతగా సేవలందించారు.

ఆమె వాయిస్ స్వీట్.. పేరు ఆర్‌జే ఇస్మార్ట్ స్వీటీ

యాంకరింగ్‌లో ఇస్మార్ట్ స్వీటీగా పేరుపొందిన ఈ యువతి అసలు పేరు పోతిన లక్ష్మి ప్రసన్న. ఎస్‌బీఎల్ జైన్ పబ్లిక్ స్కూల్‌లో 10వ తరగతి వరకు, కేబీఎన్ షైన్‌లో ఇంటర్, సిద్ధార్థ మహిళా కళాశాలలో డిగ్రీ, కేఎల్ వర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. చిన్నతనం నుంచి ప్రముఖ యాంకర్ సుమ, 'జులాయి' సినిమాలో ప్రదీప్ ఆర్జే పాత్రను ఆమె స్ఫూర్తిగా తీసుకున్నారు. స్కూల్, కాలేజీల్లో యాంకరింగ్ చేసి అందరి దృష్టిని ఆకర్షించిన ఆమె, తల్లి ప్రోత్సాహంతో సాంస్కృతిక ప్రదర్శనల్లో చురుకుగా పాల్గొంది. సెలబ్రిటీలు, అధికారులు, డాక్టర్లతో ఇంటర్వ్యూలు, వాయిస్ ఓవర్లు, యాడ్స్, కార్పొరేట్ ఈవెంట్స్‌లో తన ప్రతిభను చాటింది. యాంకరింగ్‌తో పాటు రేడియో జాకీ, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్, కూచిపూడి డాన్సర్, మోడల్, ఆన్-స్క్రీన్ ప్రెజెంటర్‌గా బహుముఖ ప్రతిభను ప్రదర్శించింది.

యాంకరింగ్ సేవలతో సమాజానికి స్ఫూర్తి.. చంద్రికా జమనా

చంద్రికా జమనా, ఒక ప్రముఖ యాంకర్, నాగార్జున వర్సిటీలో రీసెర్చ్ స్కాలర్, ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా, సామాజిక కార్యకర్తగా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా సందడి చేస్తున్నారు. ఆమె యాంకరింగ్, సమాజసేవ, విద్యా రంగంలో సేవలు అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ప్రీ-రిలీజ్ ఈవెంట్స్, బర్త్‌డే సెలబ్రేషన్స్, సాంస్కృతిక-ఆధ్యాత్మిక సమావేశాలను నడిపించే తీరుతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఆమె ఎర్త్ హీరోస్ ఫౌండేషన్‌లో డిప్యూటీ డైరెక్టర్, జనరల్ సెక్రటరీగా, సీజే ఈవెంట్స్‌లో ఎండీగా వ్యవహరిస్తున్నారు. దూరదర్శన్ మీడియా ప్రెజెంటర్‌గా, టూర్ గైడ్‌గా, సాంస్కృతిక ప్రెజెంటర్‌గానూ ప్రతిభను చాటుతున్నారు.

వైద్యం వికటించి విద్యార్థి మృతి..!

- వైద్యం సరిగ్గా అందకేనంటూ కుటుంబ సభ్యుల ఆందోళన
- రాజీ కుదరటంతో పోలీసులకు ఫిర్యాదుకు నో..!

సత్యనారాయణపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యం వికటించడంతో ఓ యువకుడు మృతి చెందాడు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో నివసించే డిగ్రీ విద్యార్థి గణేష్ రెండు రోజుల క్రితం కడుపునొప్పితో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జాయినయ్యాడు. డాక్టర్లు ఆపరేషన్ చేసిన అనంతరం అంతా బాగానే ఉందని చెప్పారు. రోగి కుటుంబ సభ్యుల నుంచి ఆపరేషన్ పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నారు. శుక్రవారం రాత్రి ఇన్‌ఫెక్షన్ సోకిందని డాక్టర్ రోగికి ప్రాణాపాయం ఉందని చెప్పారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో రోగి బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో సరైన వైద్యం అందకపోవడం వల్లే మృతి చెందాడని ఆందోళనకు దిగారు. పెద్దసంఖ్యలో కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ముందు బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బంధువులు, కుటుంబ సభ్యులు మీడియాను పిలిచి ఆసుపత్రి వద్ద హడావిడి చేశారు. తర్వాత మృతుడి కుటుంబ సభ్యులు ఆసుపత్రి వారి మధ్య రాజీ కుదరడంతో పోలీసులకు కుటుంబ సభ్యులు జరిగిన సంఘటనపైన ఫిర్యాదు చేయలేదు.

ఇషా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజినీరింగ్

- 5 నుంచి 11 వరకు ఉచితంగా నిర్వహణ

విజయవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధ ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ స్థాపించిన ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 11 వరకు ఇన్నర్ ఇంజినీరింగ్ నిర్వహిస్తున్నట్టు ఇషా ఫౌండేషన్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం శారీరక దృఢత్వం కోసం చేసే యోగా సాధన కాక జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించేందుకు చేసే మార్గదర్శకమని వారు పేర్కొన్నారు. ఆధునిక కాలంలో జీవన ఒత్తిళ్ల మధ్య మనసును ప్రశాంతంగా, శరీరాన్ని శక్తివంతంగా ఉంచే పద్ధతులను బోధించబోతున్నామన్నారు. సద్గురు రూపొందించిన ఈ కార్యక్రమంలో శాస్త్రీయంగా గుర్తింపు పొందిన యోగా విధానాలు, ధ్యాన పద్ధతులు, ఆత్మవికాసానికి దోహదపడేలా శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఈ యోగాను రెండు బ్యాచ్‌లుగా (ఉదయం 6-9 గంటల వరకు, సాయంత్రం 6-7 గంటల వరకు) ఉచితంగా నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు.

నగదు ప్రోత్సాహకాలకు దరఖాస్తు చేసుకోండి!

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను గుర్తించి, ప్రోత్సహించే లక్ష్యంగా నగదు ప్రోత్సాహక పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు శాప్, క్రీడల అభివృద్ధి అధికారి, కే కోటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం జారీచేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాపతక విజేతల నుంచి శాప్ యాప్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని అర్హత కలిగిన క్రీడాకారులు ఈనెల 4న రాత్రి 11.59గంటల లోపు దరఖాస్తులను సమర్పించాలని ఆయన కోరారు.

రూరల్ డీసీపీగా లక్ష్మీనారాయణ

- సైబర్ క్రైమ్స్‌కి కొత్తగా డీసీపీ

విజయవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ రూరల్ డీసీపీగా బి.లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం రూరల్ డీసీపీగా ఉన్న కేఎం మహేశ్వరరాజును ఈగల్ టీం ఎస్పీగా బదిలీ చేశారు. రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులిచ్చింది. అందులో ఎన్టీఆర్ కమిషనరేట్‌కు కొత్తగా డీసీపీలను కేటాయించింది. ప్రస్తుతం ఖాళీ ఉన్న ట్రాఫిక్, ఎల్ అండ్ వో 1 డీసీపీ స్థానాలను ఈ బదిలీల్లో భర్తీ చేసింది. కృష్ణకాంత్ పటేల్‌ను డీసీపీగా 1 నియమించింది. వక్ఫ్ బోర్డు సర్వే కమిషనర్‌గా ఉన్న షేక్ షరీన్ బేగంను ట్రాఫిక్ డీసీపీగా బదిలీ చేసింది. సీఐడీలో ఉన్న కృష్ణప్రసన్నను విజయవాడ సైబర్ క్రైమ్స్ డీసీపీగా నియమించింది. వారిలో కృష్ణకాంత్ పటేల్ ఎన్నికలకు ముందు విజయవాడలో పనిచేశారు. తర్వాత కొద్దిరోజులకే ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. షరీన్ బేగం విజయవాడలో పనిచేశారు.

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

భారతీనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్‌హబ్ సెంటర్‌లో ఫోర్‌వీలర్ సర్వీస్ టెక్నిషియన్ కోర్సు (7వ బ్యాచ్)కు దరఖాస్తుల స్వీకరించబడుతున్నాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయసారథి, జిల్లా నైపుణ్య అధికారి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫోర్‌వీలర్ సర్వీస్ టెక్నిషియన్ కోర్సు 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఈ ఫోర్‌వీలర్ సర్వీస్ టెక్నిషియన్ కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ కల్పించబడుతుందన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించబడతాయన్నారు. కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేస్తామన్నారు. 8వ తరగతి నుంచి ఏదైనా డిగ్రీ, ఐటీఐ అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత నవంబరు 9 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ ఆధార్, ఫోన్ నెంబరుతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలన్నారు. వివరాలకు 9985759304, 8328252829 నెంబర్లను సంప్రదించాలన్నారు.

బిగ్ స్ర్కీన్‌పై ఉమెన్స్ వరల్డ్‌కప్ ఫైనల్

- ఫైనల్‌లో తలపడనున్న ఇండియా, సౌత్ ఆఫ్రికా
- మ్యాచ్ చూసేందుకు స్టేడియంలో భారీ స్క్రీన్
- అందరూ ఆహ్వానితులే: ఏసీఏ
- టీమిండియా మహిళా క్రీడాకారులకు శుభాకాంక్షలు: ఎంపీ చిన్ని

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళల వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా విజేతగా నిలవాలని దేశం మొత్తం ఎదురుచూస్తోందని, అడుగు దూరంలో ఉన్న ఇండియా మ్యాచ్‌లో విజయం సాధించాలని ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, సెక్రటరీ సానా సతీష్ ఆకాంక్షించారు. ఆదివారం ముంబాయి వేదికగా జరగనున్న ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో సౌతాఫ్రికాతో తలపడే టీమిండియా విజయం సాధించి క్రీడాల్లో రాణించాలనుకునే మహిళా క్రీడాకారులందరికీ స్ఫూర్తిగా నిలవాలని, టీమిండియా మహిళా క్రీడాకారులందరికీ క్రికెట్ అభిమానులందరి తరపున శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. జట్టులో ఏసీఏకు చెందిన యువ ప్రతిభావంతురాలు శ్రీ చరణికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని, తన అద్భుతమైన ప్రదర్శనతో మ్యాచ్‌లో కీలకపాత్ర పోషించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ ససందర్భంగా ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్‌ను క్రికెట్ అభిమానుల భారీ స్ర్కీన్ పై వీక్షించే ఏర్పాటును ఇందిరాగాంధీ స్టేడియంలో ఏసీఏ ఏర్పాటు చేయనుంది. స్టేడియంలో అభిమానులందరూ ఒకేచోట కూర్చుని మ్యాచ్‌ను వీక్షిస్తూ మహిళా జట్టుకు ప్రోత్సాహం అందించేలా భారీ ఎల్ఈడీ స్ర్కీన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జట్టు విజయాన్ని సాధించాలని దేశం మొత్తం ఆకాంక్షిస్తున్న సందర్భంలో జట్టు అద్భుత ప్రతిభను భారీ తెరపై చూసి ఆనందించాలని ఈ ఏర్పాట్లు చేస్తున్నామని అభిమానులందరూ ఆహ్వానితులేనని ఏసీఏ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటల నుంచి మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించవచ్చుని, అందుకు తగిన ఏర్పాటు చేస్తున్నామన్నారు..

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

- హెచ్‌పీ గ్యాస్ కంపెనీ వద్ద ఖాళీ సిలిండర్ లారీని ఢీ కొన్న 350 బస్సు
- లారీ డ్రైవర్‌కు తీవ్ర, పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు

ఇబ్రహీంపట్నం, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ 30వ నంబరు జాతీయ రహదారిపై కొండపల్లి ఐడీఏలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీ వద్ద 350 నంబ రు ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో అందులోని ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. హెచ్‌పీ గ్యాస్ కంపెనీ వద్ద ఓ ఖాళీ గ్యాస్ సిలెండర్ల లారీ యూటర్న్ తీసుకుంటున్న సమయంలో విజయవాడ వైపు నుంచి మైలవరం వైపు వెళుతున్న నంబరు 350 సర్వీసు బస్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో పలువురు ప్రయాణికులకు స్వల్పంగా గాయాలయ్యాయి. పోలీసులు క్రేన్ సాయంతో బస్సును పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్లీయర్ చేశారు.


ఖాళీ గ్యాస్ సిలిండర్ల లారీని ఢీకొన్న 350 నంబరు ఆర్టీసీ బస్సు


క్రెడాయ్ ప్రోపర్టీ షో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీ రెరా చైర్మన్ ఏ శివారెడ్డి, క్రెడాయ్ విజయవాడ చాప్టర్ చైర్మన్ సతీష్ బాబు తదితరులు

జనవరి 9 నుంచి క్రెడాయ్ ప్రోపర్టీ షో

గుణదల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రంగాన్ని లాభాల బాటలోకి తీసుకెళ్లడానికి, సొంతింటి కల నెరవేర్చుకోవాలన్న ఆలోచన ఉన్న సామాన్యులకు ఉపయోగకరంగా ఉండేలా క్రెడాయ్ ప్రోపర్టీ షో నిర్వహించనున్నట్టు ఏపీ రెరా చైర్మన్ ఏ శివారెడ్డి తెలిపారు.

నగరంలోని నోవోటెల్‌లో క్రెడాయ్ 11వ ప్రోపర్టీ షో బ్రోచర్ ఆవిష్కరణ శనివారం జరిగింది. బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఏ శివారెడ్డి మీడియాతో మాట్లాడుతూ 2026 జనవరి 9, 10, 11న నగరంలోని ఏ1 కన్వెన్షన్ హాల్లో క్రెడాయ్ ప్రోపర్టీ షో జరగనుందన్నారు. ప్రోపర్టీ షోలో దేశ విదేశాల్లోని నిర్మాణ రంగానికి సంబంధించిన పలు ఉత్పత్తులకు సంబంధించిన కంపెనీలు పాల్గొననున్నాయన్నారు. అదే సమయంలో పలువురు బిల్డర్లు నిర్మాణం చేసిన విల్లాలు, భవనాలు, అపార్ట్మెంట్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి ఉన్నవారికి రుణాలిచ్చే దిశగా పలు బ్యాంకుల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ సదవకాశాన్ని అటు బిల్డర్లు, ఇటు సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకుని లాభపడాలని కోరారు. క్రెడాయ్ విజయవాడ చాప్టర్ చైర్మన్ సీ సతీష్‌బాబు, అధ్యక్షుడు జీఎస్ఆర్ మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి కే రఘురామ్, ట్రెజరర్ జీఎస్ సాయిరామ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐఐ పూర్వ చైర్మన్ జేఎస్ఆర్‌కే ప్రసాద్

ఈవీ పరిశ్రమ వైపు యువ ఇంజనీర్లు మొగ్గుచూపాలి

- సీఐఐ పూర్వ చైర్మన్ జేఎస్ఆర్‌కే ప్రసాద్ వెల్లడి

కానూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): యువ ఇంజనీర్లు ఈవీ పరిశ్రమ వైపు మొగ్గుచూపితే వారి భవిష్యత్ బంగారు బాటగా ఉంటుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (ఐసీసీ) పూర్వ చైర్మన్ జేఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయస్థాయి ఆటోమోటివ్, ఈవీ కాన్ఫరెన్స్-2025 శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ భారత్‌ను ఈ పరిశ్రమలో ప్రపంచ శక్తిగా మార్చేందుకు యువ ఇంజనీర్లు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కాగా ఫ్యూచర్ ఆఫ్ మొబిలిటీ, దేశం ప్రపంచస్థాయి టాలెంట్ పూల్‌ను ఎలా నిర్మించగలదనే అంశంపై ప్లీనరీ సెషన్లు జరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి 240 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ కంపెనీలకు చెందిన నిపుణులు ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బోస్ కంపెనీ ప్రతినిధి రియా టక్కర్‌ను సిద్ధార్థ వర్సిటీ వీసీ వెంకటేశ్వరరావు, పీవీపీ కళాశాల ప్రిన్సిపాల్ శివాజీబాబులు సత్కరించారు. సిద్ధార్థ వర్సిటీ ప్రో. వీసీ ఏవీ రత్నప్రసాద్, డాక్టర్ పీ అనూష, డాక్టర్ ఎన్ విజయానంద్‌తోపాటు పలువురు ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు చిత్రాన్ని

విజయవంతం చేయండి: హీరో

లబ్బీపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో యంగ్ కపుల్స్ ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్య నేపథ్యంలో చిత్రీకరించిన సినిమా సంతాన ప్రాప్తిరస్తు చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి విజయవంతం చేయాలని హీరో విక్రాంత్, హీరోయిన్ చాందిని చౌదరి కోరారు. బందరు రోడ్డులోని హోటల్ వివంతాలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో హీరో విక్రాంత్ మాట్లాడుతూ ఒక చక్కని ప్రేమ కథతో పాటు పెళ్లి తరువాత భార్య, భర్తల మధ్య పిల్లలు విషయంలో జరిగే సన్నివేశాలు ఆద్యంతం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయన్నారు. స్పెర్మ్ కౌంట్ సమస్యతో బాధపడే సన్నివేశాలను దర్శకుడు వినోదాత్మకంగా చిత్రీకరించారని, తాను విజయవాడ వాసినని, ఇక్కడే చదువుకుని అసిస్టెంట్ డైరెక్టర్‌గా సినీ పరిశ్రమలో అడుగుపెట్టినట్టు తెలిపారు. ఈ నెల 14న చిత్రం విడుదల కానుందని కుటుంబ సమేతంగా చిత్రాన్ని వీక్షించవచ్చని, ప్రముఖ హాస్యనటులు వెన్నెల కిషోర్, జీవన్, తాగుబోతు రమేష్ తమ హాస్యంతో ప్రేక్షకులను నవ్విస్తారని, చిత్రాన్ని వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో దర్శకుడు సంజీవ రెడ్డి పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హీరో విక్రాంత్ తదితరులు

ఏఐతోనే విద్యార్థుల భవితకు బంగారుబాట

- పీబీ సిద్ధార్థలో కంప్యూటర్ వర్క్‌షాపులో కాగ్నిజెంట్ ఏడీ సుభాష్

విజయవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు సాంకేతికతతో మమేకం కానిదే భవిష్యత్ లేదని కాగ్నిజెంట్ సంస్థ (బెంగుళూరు) అసోసియేట్ డైరెక్టర్ జేవీ సుభాష్ అన్నారు. నగరంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ కంప్యూటర్ విభాగం శనివారం కాలేజీ వెబినార్ హాలులో జనరేటివ్ ఏఐ, ప్రాంప్ట్ ఇంజనీరింగ్ అంశాలపై నిర్వహించిన వర్క్‌షాపులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచాన్ని కంప్యూటర్ ప్రోగ్రామింగ్ శాసిస్తోందన్నారు. ప్రాంప్ట్ ఇంజనీరింగ్ దీన్ని శక్తిమంతం చేస్తోందని, మరోవైపు జనరేటివ్ ఏఐ సమాచార విశ్లేషణకు దోహదపడుతోందన్నారు. సృజనాత్మకత, ఉత్పాదకతలను పెంపొందించడంలో ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. విద్యార్థులు సాంకేతికతను పెంపొందించుకుని కొత్త ఆలోచనలను ఆవిష్కరించాలన్నారు. జనరేటివ్ ఏఐ ద్వారా వ్యాపార లావాదేవీలు సులభతరమవడమే కాక కొత్త ఔషధాలు, రసాయనాల రూపకల్పన సాధ్యపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌బీ రాజేంద్రప్రసాద్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి టీఎస్ రవికిరణ్, కోనేరు శ్రీధర్, ప్లేస్‌మెంట్ అధికారి కావూరు శ్రీధర్ పాల్గొన్నారు.


వర్క్‌షాపులో మాట్లాడుతున్న కాగ్నిజెంట్ సంస్థ ఏడీ సుభాష్

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

5న సబ్ జూనియర్ జిల్లా జట్ల ఎంపిక

నందివాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో నిర్వహించే కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలను ఈనెల 5న వెన్ననపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కబడ్డీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు హెచ్‌ఎం ఎస్.వై.మాధవ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.యేసురత్నం తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ఉదయం 9 గంటలకు వెన్ననపూడి హైస్కూల్‌కు రావాలని తెలిపారు. 2009 డిసెంబరు 1 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. బాలుర విభాగంలో 60 కేజీల లోపు, బాలికల విభాగంలో 55 కేజీల లోపు బరువు ఉన్న వారు అర్హులని తెలిపారు. వెన్ననపూడి రావడానికి ఉదయం 8 గంటల 40 నిమిషాలకు గుడివాడ నుంచి లక్ష్మీనరసింహాపురం(కళింగపేట) వెళ్లే బస్సు ఉందని, వివరాలకు 97040 63555, 99493 97456కు ఫోన్ చేసి సంప్రదించాలని వారు సూచించారు.

ఐనపూరు హైస్కూల్ ఆకస్మిక తనిఖీ

పమిడిముక్కల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఐనపూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష రాష్ట్ర అధికారి శైలజ శనివారం ఆకస్మిక తనిఖీచేశారు. పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు, రికార్డులు పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధనపై విద్యార్థులను ప్రశ్నించి వారి స్థాయిని పరీక్షించారు. పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించడానికి, మంచి మార్కులు పొందడానికి అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హెచ్‌ఎం వేణుగోపాలరావు పాల్గొన్నారు.


ఐనపూరు హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న సమగ్ర శిక్ష రాష్ట్ర అధికారి శైలజ


తోట్లవల్లూరులో గుర్రపుడెక్క తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న వీరంకి గురుమూర్తి

రైతులకు ముంపు సమస్య లేకుండా చేస్తాం

● గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి

తోట్లవల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరి రైతులకు ముంపు సమస్య లేకుండా కాలువలను బాగుచేస్తామని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తెలిపారు. తోట్లవల్లూరులోని కాలువల్లో శనివారం గుర్రపుడెక్క తొలగింపు రెండోరోజు పనులను గురుమూర్తి పర్యవేక్షించారు. గుర్రపుడెక్క తొలగింపునకు అయ్యే ఖర్చును పీ-4 పథకం కింద తాను భరించి పనులు చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఎగువ నుంచి వచ్చే మురుగు దిగువకు వెళ్లకుండా గుర్రపుడెక్క అడ్డుగా ఉందన్నారు. డెక్క తొలగింపుతో ముంపు బెడద తప్పుతుందన్నారు. తుఫాను వల్ల దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు గొరిపర్తి గోపయ్య, నాయకులు వల్లూరు రాంబాబు, కొల్లా సాంబశివరావు, తోట సాయిబాబు, ఎంఎం దౌలా, బొడ్డు నితీష్ పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న కూటమి నాయకులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గుడివాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు వెనిగండ్ల రామకృష్ణ(నాని), జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం ప్రజావేదికలో నియోజకవర్గ పరిధిలోని 15 మందికి మంజూరయిన రూ.8.11లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కూటమి నాయకులతో కలిసి వారు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వమొచ్చాక నియోజకవర్గంలో సుమారు రూ.4 కోట్ల చెక్కులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, కూటమి నాయకులు పంద్రాజు సాంబశివరావు, సింగాల రాధాకృష్ణ, రామశాస్త్రులు, అందుగుల ఏసుపాదం, అంజిరెడ్డి, రబ్బానీ, కూర్మా శ్రీను పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో చెత్త తొలగింపు

గుడివాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్-2.0 కార్యక్రమంలో భాగంగా మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలోని గృహ సముదాయాల్లో అంగీకార్-2025లో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీలోని మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను మునిసిపల్ సిబ్బంది తొలగించారు. అనంతరం టిడ్కోకాలనీ వాసులకు పొడి, తడిచెత్తపై అవగాహన కల్పించారు. కూటమి నాయకులు, టిడ్కోకాలనీ వాసులు పాల్గొన్నారు.


టిడ్కోకాలనీలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం


కూచిపూడి కళాపీఠంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాట్యాచార్యులు, అధ్యాపకులు


తోట్లవల్లూరులో పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కూచిపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, నాట్యాచార్యులు యేలేశ్వరపు శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.వెంకటేశ్వరరావు, టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తి హరినాథ్‌శాస్త్రి, లైబ్రేరియన్ వైవి.ఫణికుమార్ తదితరులు నివాళులర్పించారు. మొవ్వ వీఎస్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, వైస్ ప్రిన్సిపాల్ కె.ఆర్.మంజుల, అధ్యాపకులు ఎం.సుందరరావు, టి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో శనివారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలను ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణమండపం వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తాడికొండ కృష్ణకుమార్, తమ్మన ఉమామహేశ్వరరావు, తాడికొండ ఉదయ సూర్య సుధాకర్, కొత్త శేష శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పెదపారుపూడిలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ

పెదపారుపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం, కూరగాయలను పెదపారుపూడిలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శనివారం పంపిణీ చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో 11 కుటుంబాలకు సాయమందించారు. సర్పంచ్ చప్పిడి సమీర, తహసీల్దార్ శ్రీను నాయక్, ఆర్ఐ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరీకుమారి, వీఆర్వో రాజబాబు పాల్గొన్నారు.


బొడ్డపాడు పంచాయతీ కార్యాలయం వద్ద తుఫాను బాధితులకు నిత్యావసర కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శివశంకర్

బొడ్డపాడులో..

తోట్లవల్లూరు: మొంథా తుఫాన్ బాధితులకు బొడ్డపాడు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సర్పంచ్ మూడే శివశంకర్ నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. బొడ్డపాడు, చినపులిపాక బాధితులకు కిట్లను అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె.శివశంకర్, కార్యదర్శి రమాదేవి, వీఆర్వో బి నాగేశ్వరరావు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

పాపవినాశనేశ్వరుడికి లక్ష బిల్వార్చన

పమిడిముక్కల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): లంకతోటలోని గంగా బాలాత్రిపురసుందరీదేవి సమేత పాపవినాశనేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని లక్ష బిల్వ, కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శివరామకృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు వైభవోపేతంగా అభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. మండవ సాయి వరప్రసాద్ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కపిలేశ్వరపురం, వీరంకిలాకు, హనుమంతపురం, ముళ్లపూడి గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి పూజలో పాల్గొన్నారు.


లంకతోటలో స్వామికి బిల్వార్చన చేస్తున్న అర్చకులు

వేణుగోపాలస్వామికి పుష్పాలంకరణ

గుడ్లవల్లేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక ఏకాదశి సందర్భంగా శనివారం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో గోపూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు చేసి, తామర పుష్పాలతో అలంకరించారు. భక్తులు గీతాపారాయణం నిర్వహించారు.





సత్యదేవుడి ఆలయ శిఖర ప్రతిష్ఠ నిర్వహిస్తున్న వెంకట్రావు, ప్రత్యేక అలంకరణలో రమాసహిత సత్యనారాయణ స్వామి

వైభవంగా సత్యనారాయణస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ

గుడ్లవల్లేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ, సంప్రోక్షణ కార్యకరమాలు శనివారం వైభవంగా నిర్వహించారు. శనివారం విష్వక్సేన పూజ, పుణ్యాహవచన, అగ్ని ధ్యానం, హోమములు, శిఖర ప్రతిష్ఠ, స్వామివార్ల కళాన్యాసం, సంప్రోక్షణ, పూర్ణాహుతి అనంతరం స్వామి దర్శనం నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ స్వామి శాంతి కల్యాణాన్ని ముత్తేవి శ్రీనివాస శశికాంత్ బృందం, ఆలయ ప్రధాన అర్చక స్వామి రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. వల్లభనేని వెంకట్రావు, కొసరాజు బాపయ్య చౌదరి, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, వల్లభనేని వెంకట సుబ్బారావుచౌదరి, వల్లభనేని బాబూరావు, వల్లభనేని వెంకట్రామయ్య, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జి), వల్లూరుపల్లి నాగేశ్వరరావు, వల్లూరుపల్లి సత్యనారాయణరావు, వల్లూరుపల్లి రామకృష్ణ, వల్లభనేని సుబ్బారావు, వల్లభనేని గోపాలకృష్ణ, పోలవరపు వెంకటరావు, జనసేన గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, కొండాలమ్మ ఆలయ చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు, కొండాలమ్మ ఆలయ మాజీ చైర్మన్ మన్నెం రాంబాబు, డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యచౌదరి పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి వార్షిక పవిత్రోత్సవాలు

గుడివాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి బుధవారం వరకు వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో కందుల వేణుగోపాలరావు తెలిపారు. శనివారం దేవస్థానంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పవిత్రోత్సవాలను త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్ స్వామి మంగళశాసనాలతో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. మొదటి రోజు భగవత్ ప్రార్థన, పరిషత్ దక్షిణ, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనము, రుత్విక్ వరుణ, అంకురారోపణం, మృత్సంగ్రహనం, మాయా సూత్రాబంధనం, అనిర్వాణి దీప స్థాపన, నివేదన, శాత్తుముర్రై తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పవిత్రోత్సవ కార్యక్రమంలో పాల్గొనే వారు రూ.1,116 చెల్లించి పేరు, గోత్ర నామాలను నమోదు చేయించుకోవాలని ఈవో సూచించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా జనార్దనరావు

పామర్రు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవోగా వసుమర్తి జనార్దనరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో స్నేహలత నుంచి ఆయన ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. జనార్దనరావును పంచాయతీరాజ్ ఏఈ పి.రామారావు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్ సలీం, నందమూరి స్నేహలత, పద్మశ్రీ వేణి, మొవ్వా సోమేశ్వరరావు, గ్రామ సచివాలయాల కార్యదర్శులు సత్కరించారు.


డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన జనార్దనరావును సత్కరిస్తున్న గ్రామ కార్యదర్శులు


కురుమద్దాలిలో నూతన పింఛన్లను అందిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

పామర్రు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటివద్దే పింఛన్లు అందిస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. కురుమద్దాలి గ్రామంలో కొత్తగా మంజూరయిన స్పౌజ్ పింఛన్లు, వృద్ధులు, ఇతరులకు ప్రతినెలా అందిస్తున్న పింఛన్లను శనివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోత్రు విజయభారతి, నీటి సంఘం చైర్మన్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

పామర్రు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, నిరుద్యోగులు అందివచ్చిన ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సూచించారు. కురుమద్దాలి స్కిల్ డవలప్‌మెంట్ కేంద్రంలో శనివారం నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన జాబ్‌మేళాను, జిల్లా ఉపాధికల్పన అధికారి డి.విక్టర్‌బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. జిల్లా జాబ్స్ మేనేజర్ పి.నరేష్, కురుమద్దాలి సర్పంచ్ గోత్రు విజయభారతి, నీటి సంఘాల ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత గ్రామంలో తుఫాన్ బాధితులకు ప్రభుత్వం సరఫరా చేసిన నిత్యావసర వస్తువులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్‌హౌస్

కూచిపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో మొవ్వ, కూచిపూడి జడ్పీ పాఠశాల విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో రోజువారీ కార్యక్రమాలు, పోలీసుల విధులు, కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కె.ఎన్.విశ్వనాథ్, రైటర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

గుడివాడ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు వ్యాక్సిన్లను వేయించటం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుందని మోటూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ దీప్తి తెలిపారు. శనివారం మోటూరు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆమె ఆరోగ్య పరీక్షలు చేసి, టీడీ వ్యాక్సిన్లు వేశారు. ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయుడు మోతిన్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

మూడున్నర లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న వరి

● ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకుడు సత్యనారాయణ

ఘంటసాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా రాష్ట్రంలో మూడున్నర లక్షల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనాకు వచ్చామని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకుడు డాక్టర్ పాలడుగు వెంకట సత్యనారాయణ తెలిపారు. దాలిప్రరులో తుఫాను కారణంగా దెబ్బతిన్న వరి పంట పొలాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు రైతులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. తుఫాను కారణంగా 33 శాతం పంట డ్యామేజీ అయినట్లు తెలిపారు. ఏఎంసీ ఛైర్మన్ తోట కనక దుర్గ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ తుమ్మల చౌదరిబాబు, సర్పంచ్ శాంతకుమారి, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుడిపై దాడి హేయం



గాయపడిన వీరాంజనేయులును పరామర్శిస్తున్న కనపర్తి శ్రీనివాసరావు

అవనిగడ్డ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోడూరు మండలం బడేవారిపాలెంలో దివ్యాంగుడైన అనుమకొండ వీరాంజనేయులుపై వైసీపీ కార్యకర్త వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు దారుణంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడటం హేయమైన చర్య అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన వీరాంజనేయులును విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కనపర్తి శ్రీనివాసరావు పరామర్శించారు. శుక్రవారం అనుమకొండ వీరాంజనేయులుపై వైసీపీ కార్యకర్త వెంకటేశ్వరరావు కత్తులు, గొడ్డళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చటమే కాక పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డాడని, పోలీసులు ఘటన తీవ్రతను దృష్టి లో ఉంచుకుని బాధితుడికి న్యాయం చేయాలని కోరారు.

గిరిజన స్వాభిమాన ఉత్సవాలు ప్రారంభం



గిరిజన నాయకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న జేసీ నవీన్

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నుంచి 15 రోజుల పాటు గిరిజన స్వాభిమాన ఉత్సవాలను జేసీ నవీన్ ప్రారంభించారు. జాతీయ గౌరవ దినోత్సవం సందర్భంగా బిర్సా ముండా జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖర్, కేఆర్ ఆర్సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఫణిధూర్జటి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి



డీవైఈవో పద్మారాణికి వివరాలు అందజేస్తున్న బాధితులు

ఘంటసాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దాలిప్రరు గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గద్దె శ్రీనివాసరావు చిట్టీలు, వడ్డీ వ్యాపారం, రియల్ ఎస్టేట్ పేర్లతో తమ వద్ద డబ్బులు వసూలు చేసి మోసం చేశారని ఘంటసాల పరిసర గ్రామాల వ్యక్తులు ఫిర్యాదు చేయడంతో డీఈవో రామారావు విచారణకు ఆదేశించారు. దీంతో ఉయ్యూరు డీవైఈవో పద్మారాణి, మచిలీపట్నం ఎంఈవో ఎం.వి.ఎస్.డి.ప్రసాద్ శనివారం ఘంటసాల ఎంఈవో కార్యాలయం వద్ద విచారణ చేపట్టారు. బాధితులు వారి వద్ద ఉన్న ఆధారాలను విచారణ కమిటీకి అందజేశారు. సేకరించిన వివరాలను నివేదిక రూపంలో డీఈవోకు అందజేస్తామని డీవైఈవో తెలిపారు. వీరితోపాటు ఘంటసాల ఎంఈవో-1 శివశంకర్ కూడా ఉన్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఏపీ నుంచి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ డీఈవో విచారణ కమిటీల పేరుతో కాలక్షేపం చేస్తున్నారని బాధితులు దోనేపూడి అహోబలరావు, దోనేపూడి నాగేశ్వరరావు, తలశిల రంగారావు, దోనేపూడి జానకి రామయ్య తదితరులు ఆరోపించారు. కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసం చేసిన శ్రీనివాసరావు ఉపాధ్యాయ వృత్తి నుంచి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు.

నాడు - నేడు పనులపై విచారణ

పాపవినాశనం ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన నాడు - నేడు పనుల్లో అవకతవకలు జరిగాయని ఆ గ్రామానికి చెందిన మునిపల్లి అర్జునరావు ఫిర్యాదు ఇవ్వడంతో డీఈవో రామారావు విచారణకు ఆదేశించారు. మచిలీపట్నం ఎంఈవో ఎంవీఎస్.డి.ప్రసాద్, ఘంటసాల ఎంఈవో శివశంకర్ రావు శనివారం పాఠశాలలో విచారణ చేపట్టారు. అర్జునరావును విచారణకు హాజరుకావాలని సమాచారం ఇవ్వగా, ఆయన మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారని ఎంఈవో ప్రసాద్ తెలిపారు. రికార్డులు పరిశీలించామని, నివేదిక డీఈవోకు అందజేశామని తెలిపారు.

మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం



మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కానూరు, తాళ్లపాలెం గ్రామాల్లో శనివారం మొంథా తుఫాన్ కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. చెరువులు, పడవలు, వలలు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం అంచనాలు తయారు చేస్తున్నామని, మత్స్యకారులతో పాటు చేనేత, రైతులందరికీ తగిన న్యాయం చేసి ఆదుకుంటామని తెలిపారు. పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి జి.మోహనరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచే నాని, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గోకవరం పీఏసీఎస్ అధ్యక్షుడు మీనవల్లి నాగేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే నారాయణప్రసాద్, తహసీల్దార్ నాగభూషణం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే 'పీ-4' లక్ష్యం

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే పీ-4 కార్యక్రమ లక్ష్యమని, పెదపట్నం గ్రామంలోని యానాదుల కుటుంబాలను పీ-4 కార్యక్రమం కింద కొల్లు ఫౌండేషన్ తరఫున దత్తత తీసుకుంటున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పెదపట్నంలోని తుఫాన్ శిబిరంలోని బాధితులకు శనివారం ఆయన ఆర్థికసాయం, బియ్యం పంపిణీ చేశారు. గుర్తింపుకార్డులు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని పెదపట్నంలోని యానాదులు మంత్రి రవీంద్ర దృష్టికి తీసుకెళ్లారు. ఆధార్, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని అడిగారు. స్పందించిన మంత్రి.. గుడిసెవాసులకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.50 లక్షలు నిధులు అందిస్తుండగా ఎస్టీ కార్పొరేషన్ నుంచి కూడా నిధులు ఇప్పిస్తామన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచే నాని, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, లంకే నారాయణప్రసాద్, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.



నడకుదురులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

రైతాంగాన్ని ఆదుకుంటాం

చల్లపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను బాధిత రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. నడకుదురులో తుఫాన్‌గాలులు, వర్షాలకు దెబ్బతిన్న వాణిజ్య పంటలను శనివారం ఆయన పరిశీలించారు. నష్టం అంచనా వేయించి ప్రభుత్వం సకాలంలో రైతులకు పరిహారం ఇస్తుందని తెలిపారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, సొసైటీ ఛైర్మన్లు గుత్తికొండ వంశీకృష్ణ, పెద్దిబోయిన హరినాథ్, ఏఎంసీ డైరెక్టర్ నాదెళ్ల వెంకట నరసయ్య, మాజీ సర్పంచ్ మాతంగి వేణు, టీడీపీ నేత కైతేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన



కంచాకోడూరులో పొలాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

గూడూరు/కృత్తివెన్ను, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన పంట పొలాలను శనివారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పరిశీలించారు. గూడూరు మండలం కంచాకోడూరు, కృత్తివెన్ను మండలం నీలిపూడి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పోతన స్వామి, కోలపల్లి రజని,కటకం నాగమల్లేశ్వరరావు, గోపీ నాగబాబు, ఎస్‌ఏ బేగ్, కోళ్ల నాగరాజు, మునగాల భాస్కర్, బొర్రా శ్రీను, తోట వేణు, దూడల శివశంకర్ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించండి

● జయలక్ష్మి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీకి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచన

పెడన, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించాలని జయలక్ష్మి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీకి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం శనివారం సంఘ ఆవరణలో నిర్వహించారు. ఛైర్మన్‌గా యర్రపోతు నాగేశ్వరరావు, సభ్యులుగా బూసం డోలాంబ, కూనపరెడ్డి రంగయ్యనాయుడు ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ విచ్చేశారు. సహకార సంఘాల ఉద్యోగుల సంఘ రాష్ట్రనేత జన్యావుల రామాంజనేయులు, బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, మునిసిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ అబ్దుల్ ఖయూం, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చందన నారాయణరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, కౌన్సిలర్ మట్టా శివపావని, జనసేన నాయకులు విక్కుర్తి శ్రీనివాసరావు, వరుదు రామకృష్ణ, మట్టా నాగరాజు పాల్గొన్నారు.

నాగాయలంక ఎంపీడీవోగా చంద్రశేఖర్

నాగాయలంక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా కె.ఎం. చంద్రశేఖర్ శనివారం పూర్తి అదనపు బాధ్యతలతో విధుల్లో చేరారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన వెంగళరావు ఉద్యోగ విరమణ చేయడంతో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న చంద్రశేఖర్‌కు ఉన్నతాధికారులు ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు అందజేత

చల్లపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాను సమయంలో ప్రభుత్వ యంత్రాంగం ఉత్తమ సేవలందించారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రశంసించారు. లక్ష్మీపురంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో తుఫాను బాధితులకు ప్రభుత్వ సహాయ పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. బాధితులకు బియ్యం, కందిపప్పు, నూనె, బంగాళదుంపలు, ఉల్లిపాయలు, పంచదార తదితర సరుకుల పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, సొసైటీ ఛైర్‌పర్సన్ బొందలపాటి వీరబాబు, తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీటీసీ నూకల వెంకటేశ్వరరావు, వీఆర్వో తూము శ్రీనివాసరావు, ఈవో ఉమామహేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్లు సూదాని నందగోపాల్, షేక్ ఇబ్రహీం, డీలరు చింతారావు, జనసేన నేతలు పాల్గొన్నారు.

కె.కొత్తపాలెంలో..

మోపిదేవి: తుఫాన్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం పంపిణీని కె.కొత్తపాలెంలో శనివారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, తహసీల్దార్ హరినాథ్, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబు పాల్గొన్నారు.



నాగాయలంక, పెడనలో పొట్టిశ్రీరాములు విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

నాగాయలంక/పెడన, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శనివారం ఆర్యవైశ్య నాయకులు ఘనంగా నిర్వహించారు. నాగాయలంకలో ఆర్యవైశ్య భవనం వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. చిట్టా శివనాగేశ్వరరావు, చిట్టా సాంబశివరావు, తాడికొండ సత్యనారాయణ పాల్గొన్నారు. పెడన పాత కూరగాయల మార్కెట్ ఆవరణలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి చిన్నా, మామిడి ప్రసాద్ పాల్గొన్నారు.

సాయిమౌనికకు

మొంథా పోరాట యోధ అవార్డు



సీఎం చంద్రబాబునాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న పశువైద్యురాలు సాయిమౌనిక

నాగాయలంక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పశువైద్యురాలు సీహెచ్ సాయి మౌనిక ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబు నాయుడు నుంచి శనివారం మొంథా తుఫాను పోరాట యోధ అవార్డును అందుకున్నారు. తుఫాన్ సమయంలో సంగమేశ్వరం శివారు పాత ఉపకాలిలోని ఇసుక దిబ్బలలో చిక్కుకుపోయిన నలుగురు గొర్రెల కాపరులను, 910 గొర్రెలను ప్రత్యేక పడవలను ఏర్పాటు చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆమె కాపాడారు.

ఇన్‌చార్జి తహసీల్దార్ కిరణ్మయికి ప్రశంస



సీఎం చంద్రబాబు నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న కిరణ్మయి

కోడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో సంసిద్ధత, సహాయక చర్యల్లో అంకితభావం, అవిశ్రాంత కృషిని గుర్తిస్తూ ఇన్‌చార్జ్ తహసీల్దార్ జె.సౌజన్య కిరణ్మయికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ప్రశంసా పత్రం అందించారు.

పేద కుటుంబానికి ఆప్తా బాసట

చల్లపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆప్తా (అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్) సంస్థ ఆధ్వర్యంలో ప్రతినిధి సందు నరసింహారావు చొరవతో పేద కుటుంబాలకు సేవలందించడం ముదావహమని యువనేత మండలి వెంకట్రామ్ అన్నారు. చల్లపల్లిలో భర్తను కోల్పోయి ఇద్దరు ఆడపిల్లలతో జీవిస్తున్న తల్లి నాగ బాబ్జీ కుటుంబానికి ఆప్తా ఆధ్వర్యంలో శనివారం స్థానిక జనసేన కార్యక్రమంలో చేయూత అందించారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, 50కిలోల బియ్యం, తల్లీ-కుమార్తెలకు నూతన దుస్తులను వెంకట్రామ్ చేతులమీదుగా అందజేశారు. పిల్లల విద్యాభివృద్ధికి, ఉన్నత చదువులకు సహకారం ఇవ్వటం, రెండున్నరేళ్లపాటు పేద కుటుంబ పోషణకు ఆప్తా సంస్థ ముందుకురావటం స్ఫూర్తిదాయకమన్నారు. సొసైటీ ఛైర్‌పర్సన్ బొందలపాటి వీరబాబు, నేతలు అడపా రవి, ప్రెస్ పూర్ణ, సూదాని నందగోపాల్, మిరియాల జితేందర్, ఎం.రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అందజేత

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మేకావారిపాలెం శివారు నవీన్‌మిట్టల్ కాలనీలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వరలక్ష్మి, స్వామి దంపతులకు శనివారం డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ విలువైన కుట్టు మిషన్ అందజేశారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, హేమశ్రీ, గంపల భవానీ పాల్గొన్నారు.